www.vaarthavedhikasurya.com

RNI NO: TGTEL/25/A0305

# వార్త వేదిక సూర్య

తెలుగు దినపత్రిక

VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

యాదాద్రి భువనగిరి | గురువారం 30, అక్టోబర్ 2025 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాసచారి | సంపుటి : 01 | సంచిక: 162 | పేజీలు: 08 | వెల: 5/


## కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఎంఐఎంకు వేసినట్లే

- పోలీస్ స్టేషన్లలో బైండోవర్ అయ్యే కాంగ్రెస్ అభ్యర్థి కావాలా?
- ప్రజల మధ్య తిరిగే బిజెపి అభ్యర్థి కావాలా?
- పార్టీ పదాధికారుల సమావేశంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

7లో..



## రహదారి నిర్మాణాల వద్ద క్యూఆర్ కోడ్



- పారదర్శకతకు పెద్దపీట వేసే యోచన
- నిర్మాణ వ్యవహారాలపై ప్రజలు తెలుసుకునే అవకాశం
- కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి

న్యూఢిల్లీ,అక్టోబర్29(వార్త వేదిక సూర్య): దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రధాన రహదారులపై క్యూఆర్ కోడ్ స్కానర్‌లను ప్రవేశ పెట్టాలని కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రతిపాదించారు. దీంతో రోడ్ల న ఇర్మాణానికి సంబంధించిన అన్ని వివరాలు తెలుసుకునే వీలు కలుగుతుందన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధిలో పారదర్శకత, జవాబు దారీతనాన్ని పెంచడానికి ఇవి ఉపయోగ పడతాయన్నారు. పౌరులు ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఆ ప్రాజెక్టు కోసం పని చేసిన కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు, నిర్మాణానికి మంజూరుచేసిన బడ్జెట్, గడువు, నిర్వహణ వంటి కీలక వివరాలు వెల్లడవు తాయని పేర్కొన్నారు. 'స్మార్ట్ రోడ్ల భద్రత' అనే అంశంపై దిల్లీలో నిర్వహించిన ఓ సమావేశంలో ప్రసంగించిన గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. రోడ్లు బాగా లేకపోతే అందరూ తననే నిందిస్తారని.. మొత్తం వ్యవస్థ చేసిన తప్పునకు తాను మాత్రమే ఎందుకు తిట్లు తినాలని, సోషల్ మీడియాలో ఆరోపణలపై

మిగతా 2లో..

## మూడు జిల్లాల్లో నేడు స్కూళ్లకు సెలవు

- సిద్దిపేట, హన్మకొండ, ములుగులకు వర్తింపు

హైదరాబాద్,అక్టోబర్29(వార్త వేదిక సూర్య): మొంథా తుఫాన్ ప్రభావంతో తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా సిద్దిపేట, హన్మకొండ, ములుగు జిల్లాల్లో బుధవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో నదులు, వాగులు పొంగిప్రవహిస్తున్నాయి. రహదారులపై నీరు చేరి రాకపోకలు అంతరాయం ఏర్పడింది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని

మిగతా 2లో..





## మొంథా ప్రభావంతో తెలంగాణలో వర్షాలు

- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయండి
- అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సీఎం ఆదేశం

హైదరాబాద్,అక్టోబర్29(వార్త వేదిక సూర్య): మొంథా తుపాను తీవ్ర వాయుగుండంగా మారి భారీ వర్షాలు కురుస్తున్నాయి. తెలంగాణలో కూడా దాని ప్రభావం తీవ్రంగా ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. తీరం దాటిన తుఫాన్ భద్రాద్రి కొత్తగూడం మీదుగా తెలంగాణలో ప్రవేశించింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణలో వాయుగుండం ప్రభావంపై సీఎం అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకొని..

మిగతా 2లో..

# మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి..!



- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ
- కాంగ్రెస్ పార్టీ మైనార్టీ పాచిక
- మాజీ క్రికెటర్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి
- 31న ప్రమాణ స్వీకారానికి రంగం సిద్ధం
- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన కాంగ్రెస్ అధిష్టానం
- సిఎం రేవంత్‌తో అజారుద్దీన్ భేటీ

హైదరాబాద్,అక్టోబర్29(వార్త వేదిక సూర్య): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వేళ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ పాచిక పన్నుతోంది. ఇంతకాలం కేబినేట్‌లో మైనార్టీలకు చోటుదక్కలేదు. తాజాగా మహమ్మద్ అజహరుద్దీన్‌కు మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయించింది. శుక్రవారం తెలంగాణ మంత్రివర్గ విస్తరణ కార్యక్రమం జరగనుంది. అజహరుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం. ఈ మేరకు రాష్ట్రమంత్రి వర్గ విస్తరణకు ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. ఇదిలావుంటే తాజాగా అజారుద్దీన్‌ను సిఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలుసుకోవడం, వార్తలకు బలం చేకూరింది. తనకు మంత్రి పదవి ఇవ్వాలన్న నిర్ణయంపై ధన్యవాదాలు తెలిపినట్లు తెలుస్తోంది. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అయితే, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించినట్టుగా తెలుస్తోంది. రాష్ట్రంలో ఎప్పుడు కేబినెట్ ఏర్పడినా.. ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ



తరపున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు సాధ్యపడలేదు. ముస్లిం మైనార్టీ వర్గానికి ఏదో విధంగా మంత్రివర్గంలో స్థానం కల్పించాలనే ఆలోచనతో కాంగ్రెస్ అధిష్ఠానం ఉంది. అజాహరుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్ఠానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక ప్రక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపినట్టు సమాచారం. మంత్రివర్గ విస్తరణపై గత రెండ్రోజులుగా ఏఐసీసీలో విస్తృతంగా చర్చ జరిగినట్టు తెలుస్తోంది. అయితే బిసి రిజర్వేషన్లపై కసరత్తు జరుగుతున్న వేళ కేబినేట్‌లో బిసిల కోటాను పెంచాలని డిమాండ్ వచ్చింది. దీనిని కాంగ్రెస్ పట్టించుకున్నట్లు లేదు. మొదటి సారి ముఖ్యమంత్రితో పాటు 12 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో ముగ్గురు మంత్రులుగా ప్రమాణం చేశారు. ప్రస్తుతం మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశం ఉండటంతో కాంగ్రెష్ అధిష్ఠానం ముస్లిం మైనారిటీకి అవకాశం కల్పించింది. ఒక వేళ గవర్నర్ కోటాలో అజాహరుద్దీన్‌కు అవకాశం దక్కని పక్షంలో.. త్వరలో కొన్ని ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత 6 నెలల్లో అజాహరుద్దీన్‌ను ఎమ్మెల్సీని చేసే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇంకా మిగిలి ఉన్న రెండు మంత్రి పదవులు ఏయే సామాజిక వర్గానికి ఇవ్వాలనే దానిపై కసరత్తు కొనసాగు తున్నట్లు తెలుస్తోంది. దీంతో బిసి సామాజిక వర్గాలు ఒత్తిడి పెంచే అవకాశం ఉంది. రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, బీర్ల అయిలయ్యలు ఎప్పటి నుంచో మంత్రిపదవికి డిమాండ్ చేస్తున్నారు. అజారుద్దీన్ రాకతో ఇప్పుడు హైదరాబాద్‌కు చోటు దక్కినట్లు కానుంది.


## బీహార్‌లో రిమోట్ కంట్రోల్ పాలన



- నితీశ్‌ను ముందు పెట్టి నడుపుతున్న బిజెపి
- ఎన్నికల ప్రచారంలో రాహుల్ విమర్శలు

పాట్నా,అక్టోబర్29(వార్త వేదిక సూర్య): నీతీశ్ కుమార్‌ను ఎదురుగా పెట్టి బిహార్‌లో భాజపా రిమోట్ కంట్రోల్ సర్కారును నడుపుతోందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. భాజపా నేతృత్వంలోని కేంద్రం సామాజిక న్యాయానికి వ్యతిరేకమని విమర్శించారు. ప్రతిపక్షాలు పట్టుబట్టడం వల్లే మోదీ ప్రభుత్వం కుల గణనకు అంగీకరించిందన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ముజఫ్ఫర్‌పుర్‌లో నిర్వహించిన తన తొలి ప్రచార సభలో రాహుల్ ప్రసంగించారు. మహారాష్ట్ర, హరియాణాల్లో ఓట్ల చోరీ జరిగిందని, బిహార్‌లోనూ ఇది పునరావృతమవుతుందని ఆరోపించారు. బిహార్ ప్రభుత్వం

మిగతా 2లో..



## స్పామ్ కాల్స్‌కు ఇక చెక్..!

- మోసపూరిత కాల్స్ సులువుగా గుర్తింపు
- ట్రాయ్ ఆధ్వర్యంలో ట్రూకాలర్ సేవలు

న్యూఢిల్లీ,అక్టోబర్29(వార్త వేదిక సూర్య): భారత టెలికమ్యూనికేషన్ రంగంలో ఒక కీలక మార్పు రాబోతోంది. ఇకపై కాల్ వచ్చే సమయంలో నంబర్‌తో పాటు కాలర్ పేరు కూడా కచ్చితంగా కనిపించేలా ట్రాయ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. స్పామ్ కాల్స్‌ను అరికట్టే దిశగా కాలింగ్ నేమ్ ప్రజెంటేషన్ సేవను డీఫాల్ట్ ఫీచర్‌గా ప్రవేశ పెట్టాలని ట్రాయ్ అంగీకరించింది. అక్టోబర్ 28న విడుదలైన ఈ నిర్ణయం ప్రకారం ఇకపై కాల్ చేసిన వారి పేరు నంబర్‌తో పాటు రిసీవ్ చేసుకొనే వ్యక్తికి స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సేవ అమలుకు సంబంధించిన చర్చలు

మిగతా 2లో..

## రాష్ట్రంలో పడకేసిన పాలన

- ధాన్యం, పత్తి కొనుగోలు చేసే పరిస్థితే లేదు
- బోనస్ లేదు.. పెట్టుబడి సాయం లేదు..
- విత్తనాలు లేవు.. ఎరువులు లేవు
- ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి
- కాపు ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ ఎద్దేవా



హైదరాబాద్,అక్టోబర్29(వార్తవేదిక సూర్య): తెలంగాణ రాష్ట్రంలో రెండేళ్ల నుంచి అహ! నా పెళ్లంట సినిమా నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మున్నూరు కాపు ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ పాల్గొని, మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే... ఆ సినిమా తరహాలోనే కోడిని చూపించి.. అదే చికెన్ బిర్యానీ. ఆ కోడి పేరే ఆరు గ్యారెంటీలు. నిన్న యూసఫ్ గూడకు వెళ్లారు.. అదేదో పిలిచినట్లే రేవంత్ రెడ్డి అక్కడికి వెళ్లారు. మన సన్మానం మనమే చేపించుకోవడం అంటే అదే. నేను చెప్పిన ప్రతిమాట నిలబెట్టుకుంటా అని నేనేమి చెప్పట్లేదు అని ఆ మీటింగ్ చివర్లో రేవంత్ రెడ్డే చెప్పేశారు. కాంగ్రెస్‌కు ఓటేయాలనే ఉత్సాహం ఎవ్వరిలోనూ కనిపించడం లేదు. రాష్ట్రంలో ధాన్యం, పత్తి కొనుగోలు చేసే పరిస్థితే లేదు. బోనస్ లేదు.. పెట్టుబడి సాయం లేదు.. విత్తనాలు లేవు.. ఎరువులు లేవుఎరువుల కోసం లైన్‌లో నిలబడి రైతు చనిపోయిన పరిస్థితి కూడా చూశాం. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను కూడా మోసం చేశారు. మంత్రులు అబద్దాలు చెబితే కనీసం అతికేటట్లు కూడా లేవు. మొత్తం మీద ఇప్పటి వరకు

మిగతా 2లో..



## రఫేల్ యుద్ధ విమానంలో విహరించిన రాష్ట్రపతి

- రాష్ట్రపతి ముర్ముతో రఫేల్ రాణి శివాంగీ సింగ్

న్యూఢిల్లీ,అక్టోబర్29(వార్త వేదిక సూర్య): రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము బుధవారం రఫేల్ యుద్ధ విమానంలో విహరించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. హరియాణాలోని అంబాలా వైమానిక స్థావరంలో దేశ ప్రథమ పౌరురాలు, త్రివిధ దళాల సుప్రీం కమాండర్ ద్రౌపది ముర్ము భారత వైమానికి దళానికి చెందిన రఫేల్ యుద్ధ విమానంలో విహరించారు. ముందుగా భద్రతా దళాల నుంచి సైనిక వందనం స్వీకరించారు. ఫ్లైయింగ్ సూట్ ధరించిన రాష్ట్రపతి ప్రస్తుతం రఫేల్ యుద్ధ విమానంలో గగన విహారం చేసారు. ఇందులో యుద్ధ విమాన పైలట్ శివాంగీ సింగ్‌తో దిగిన ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో ఆమెని బంధించి



నట్లు పాక్ ప్రచారం చేయడంతో సింగ్ పేరు అప్పట్లో మార్మోగింది. పహల్గాం దాడికి ప్రతీకారంగా

మిగతా 2లో..



## సిఎం, పిఎం సీటు ఖాళీగా లేదు

- తేజస్వీ, రాహుల్‌కు నిరాశ తప్పదు
- బీహార్ ఎన్నికల ప్రచారంలో అమిత్ షా

పట్నా,అక్టోబర్29(వార్త వేదిక సూర్య): బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల తేదీ సమీపిస్తోన్న నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాలు వేడెక్కాయి. ఎన్డీయే, ఆర్జేడీ నేతృత్వంలోని మహాగర్ బంధన్ అధికారాన్ని చేజిక్కించు కోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. విపక్ష కూటమి సీఎం అభ్యర్థి తేజస్వీయాదవ్ అని ఇప్పటికే ప్రకటన రాగా ఎన్డీయే ముఖ్యమంత్రి అభ్యర్థిపై మాత్రం స్పష్టత లేదు. దానిపైనే విపక్షాలు ప్రశ్నలుసంధిస్తున్నాయి. దాంతో తాము నీతీశ్ నాయకత్వంలో బిహార్ ఎన్నికలకు వెళ్తామని ఇటీవల మోదీ ప్రకటించారు. ఆయనే సీఎంగా కొనసాగుతారని తాజాగా అమిత్ షా స్పష్టంచేయడంతో ఎన్డీయే సీఎం అభ్యర్థి ఎవరన్న అంశంపై ఉన్న సందిగ్ధత వీడిపోయింది. ఈ క్రమంలో

మిగతా 2లో..

## 8వ వేతన సవరణ గొప్ప నిర్ణయం

- కేబినేట్ నిర్ణయంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి హర్షం

హైదరాబాద్,అక్టోబర్29(వార్త వేదిక సూర్య): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ దిశగా కేంద్ర కేబినెట్ తీసుకున్న కీలక నిర్ణయంపై కేంద్రమంత్రి జీ. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. 8వ వేతన సవరణ సంఘం విధివిధానాలను ఆమోదించినందుకు కేంద్ర కేబినెట్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన స్పందించారు. కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్, సబ్ కా ప్రయాస్' అనే ప్రధానమంత్రి నరేంద్రమోదీ నినాదం ఆధారంగా దేశంలోని ప్రతివర్గం సమగ్రాభివృద్ధి

మిగతా 2లో..



# రఫేల్ యుద్ధ విమానంలో విహరించిన రాష్ట్రపతి

(మొదటి పేజీ తరువాయి)

భారత్ ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సమయంలో దాయాది పాకిస్థాన్ సోషల్ మీడియాలో విపరీతంగా అసత్య ప్రచారం చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగానే భారత్‌కు చెందిన రఫేల్ సహా పలు యుద్ధ విమానాలను నేలకూల్చామని, ఓ మహిళా పైలట్‌ను బంధించామని పాక్ అబద్దాలు ప్రచారం చేసింది. ఈ ప్రచారాన్ని భారత్ అప్పట్లోనే ఖండించింది. దీంతో నాడు శివాంగీ సింగ్ పేరు నెట్టింట తెగ వైరల్‌గా మారింది. ఇప్పుడు ఆమెతో రాష్ట్రపతి ముర్ము ఫొటో దిగడంతో శివాంగీ మరోసారి వార్తల్లో నిలిచారు. ఆమె కోసం నెటిజన్లు శోధిస్తున్నారు.

సింగ్ స్వస్థలం వారణాసి. అక్కడే పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేసిన ఆమె.. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం లో డిగ్రీ పట్టా అందుకున్నారు. ఈ క్రమంలోనే ఎన్‌సీసీలో చేరారు. ఆపై 2016లో ఎయిర్‌ఫోర్స్ అకాడమీలో శిక్షణ తీసుకున్నారు. చిన్నతనం నుంచీ పక్షిలా ఆకాశంలో ఎగరాలని కలలు కన్న ఆమె.. ఎప్పటికైనా పైలట్ అవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మొదటి దశ యుద్ధ విమాన పైలట్లుగా నియమితులైన మోహనా సింగ్, భావనా కాంత్, అవనీ చతుర్వేది స్ఫూర్తితో పైలట్‌గా శిక్షణ తీసుకున్నారు. 2017లో రెండో దశ యుద్ధ విమాన పైలట్లలో ఒకరిగా ఎంపికైన శివాంగీ.. మిగ్-21 బైసన్ యుద్ధ విమానాలు నడపడంలో ప్రావీణ్యం సాధించారు.

మిగ్ ఫైటర్ జెట్లు నడిపిన అనుభవంతోనే 2020లో



దేశంలోనే అత్యాధునిక రఫేల్ యుద్ధ విమానాన్ని నడిపే అవకాశం దక్కించుకున్నారు. అప్పటి నుంచి అంబాలా ఎయిర్‌బేస్‌లోని 'గోల్డెన్ యారోస్' స్క్వాడ్రన్ బృందంలో భాగంగా విధులు నిర్వర్తిస్తున్నారు. 2022లో జరిగిన గణతంత్ర వేడుకల్లో 'భవిష్యత్తు కోసం భారత వైమానిక దళం రూపాంతరం చెందుతోంది' అనే థీమ్‌తో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ శకటాన్ని ప్రదర్శించింది. ఈ శకటంలో రఫేల్ ఫైటర్ జెట్ యుద్ధ విమానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ శకటంపై శివాంగి సింగ్ సెల్యూట్ చేస్తూ కనిపించారు. గణతంత్ర వేడుకల పరేడ్‌లో పాల్గొన్న రెండో పైలట్‌గా ఘనత సాధించారు. ఆ సమయంలో ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆనంద్ మహీంద్రా 'రఫేల్ రాణి' అంటూ చేసిన పోస్ట్ ఆకట్టుకుంది.

## స్పామ్ కాల్స్‌కు ఇక చెక్..!

(మొదటి పేజీ తరువాయి)

చాలా కాలంగా కొనసాగుతున్నాయి. సేవ సాధ్యాసాధ్యాలపై సిఫార్సులు ఇవ్వాలని టెలికమ్యూనికేషన్స్ విభాగం 2022 మార్చిలో ట్రాయ్‌ను సంప్రదించింది. ఆ తర్వాత 2024 ఫిబ్రవరిలో ట్రాయ్ తన తొలి సిఫార్సులను సమర్పించగా.. 2025 సెప్టెంబరులో ఆని పునఃపరిశీలన కోరింది.

ఈ నేపథ్యంలో ట్రాయ్ తాజాగా ఇచ్చిన సమాధానంలో ప్రభుత్వ సూచనలను పరిగణనలోకి తీసుకుని కొన్ని కీలక మార్పులతో తన మునుపటి సిఫార్సులను పునరుద్ధరించింది. ఈ సేవ ప్రధానంగా మోసపూరిత, స్పామ్ కాల్స్‌ను అరికట్టడమే లక్ష్యంగా దశలవారీగా ప్రవేశపెట్టబడుతుంది. ఇది అన్ని వినియోగదారులకూ డీఫాల్ట్‌గా యాక్టివ్‌గా ఉంటుంది. కానీ, అవసరమైతే ఆప్షనల్‌గా డిసేబుల్ చేసుకునే అవకాశం ఉంటుంది. వినియోగదారుల పేర్లు ఐజఆ ధృవీకరించిన వివరాల ఆధారంగా చూపిస్తాయి. లైసెన్సింగ్ నియమాల్లో కాలింగ్ లైన్ ఐడెంటిఫికేషన్ నిర్వచనాన్ని విస్తరించి.. కాలింగ్ నేమ్ ను కూడా చేర్చనున్నారు. గోప్యత రక్షణలో భాగంగా.. ఎంచుకున్న వినియోగ దారుల పేర్లు మాత్రం ప్రదర్శించబడవు. వ్యాపార వినియోగదారులు తమ ట్రేడ్ నేమ్ లేదా ట్రేడ్‌మార్క్‌ను కాలర్ ఐడెంటిటీగా చూపించుకునే వీలు ఉంటుంది.

కానీ, అది ప్రభుత్వ ధృవీకరణ పక్రియకు లోబడి ఉంటుంది. అలాగే కొత్త మొబైల్ పరికరాల్లో ఫీచర్ తప్పనిసరిగా ఉండేలా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ తో సమన్వయం చేయాలని ట్రాయ్ ప్రకటించింది. ఈ సేవను అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం మార్గదర్శకాలకు అనుగుణంగా సప్లిమెంటరీ సేవగా వర్గీకరించారు. ట్రాయ్ తాజా నిర్ణయం మేరకు టెలికాం ఆపరేటర్లకు ఒక వారంలో కనీసం ఒక సర్కిల్‌లో సేవ ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత 60 రోజుల పైలట్ దశ పూర్తి చేసిన అనంతరం దేశవ్యాప్త రోల్‌అవుట్ జరగనుంది.

ఈ కొత్త మార్పు ద్వారా కాల్ ట్రాన్స్‌పరెన్సీ పెరగడం, స్పామ్ లేదా మోసపూరిత కాల్స్‌ను సమర్థవంతంగా అరికట్టడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

## మూడు జిల్లాల్లో నేడు స్కూళ్లకు సెలవు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లా కలెక్టర్లు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులు సంయుక్తంగా సమీక్ష నిర్వహించి, వర్షపాతం తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గురువారం సిద్దిపేట, హన్మకొండ, ములుగు జిల్లాల్లోని అన్ని విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. పాఠశాలలు, కళాశాలలు, ప్రైవేట్ విద్యాసంస్థలు ఈ నిర్ణయానికి లోబడుతాయి. అలాగే వాతావరణ శాఖ హెచ్చరికలను పరిగణనలోకి తీసుకుని అధికారులు ప్రజలను జాగ్రత్తగా ఉండాలని సూచించారు. తుఫాన్ ప్రభావం కొనసాగుతున్నందున అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని విజ్ఞప్తి చేశారు. తక్కువ ఎత్తు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే సమీపంలోని సురక్షిత ప్రదేశాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. హన్మకొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ములుగు జిల్లా ఏటూరు నాగారం, గోవిందరావుపేట, తాడ్వాయి, వెంకటాపురం మండలాల్లో వాగులు పొంగి రహదారులు తెగిపోయాయి. కొందరు గ్రామాలు రోడ్డు మార్గం ద్వారా సంబంధాలు కోల్పోయాయి. స్థానిక ఎన్‌డీఆర్ఎఫ్,÷ర్ సిబ్బంది అప్రమత్తంగా ఉండి సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నారు. అధికారులు ప్రజలకు హెచ్చరికలు జారీ చేసి, పరిస్థితి అదుపులోకి వచ్చే వరకు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

## బీహార్‌లో రిమోట్ కంట్రోల్ పాలన

(మొదటి పేజీ తరువాయి)

రిమోట్ కంట్రోల్ ద్వారా నడుస్తోందని తేజస్వీ యాదవ్ ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నాను. భాజపా కేవలం నీతీశ్ కుమార్‌ను వాడుకుంటోంది. దేశసంపద కొంతమంది సంపన్నుల చేతుల్లోకి వెళ్లిపోతోంది. బిహార్ వంటి ప్రాంతాలు పేదరికంలో కూరుకుపోవడానికి ఇదే కారణం. నోట్ల రద్దు వల్ల దేశ ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టంపై



ప్రధాని మోదీ మౌనంగా ఉన్నారు. ఛఠ్ పూజ సందర్భంగా దిల్లీలోని యమునా నది ఘాట్ వద్ద పూజలు చేయనున్నట్లు ప్రకటించిన ఆయన.. ఆ తర్వాత అది కృత్రిమంగా నిర్మించిందని తెలుసుకుని వెనకడుగు వేశారని రాహుల్ విమర్శించారు. ఓట్ల కోసం ప్రధాని మోదీ ఎంతకైనా వెళ్తారంటూ అనుచిత

వ్యాఖ్యలు చేశారు. బిహార్ లో 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రయోజనాలు కాపాడతామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. రాజ్యాంగ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రజలు తమ సామర్థ్యాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆధునిక నలంద విశ్వవిద్యాలయానికి కాంగ్రెస్ హయాంలోనే నాంది పడిందన్నారు. భవిష్యత్తులో అమెరికన్లు సైతం తమ ఉన్నత విద్య కోసం ఇక్కడి వస్తారని జోస్యం చెప్పారు.

తాము అధికారంలోకి వస్తే రూ.500కే వంటగ్యాస్ సిలిండర్లు అందజేస్తామని ఆర్జేడీ నేత, 'మహాగఠ్‌బంధన్' సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ ప్రకటించారు. ఇటీవల కాలంలో ఎన్డీయే ప్రభుత్వం రాష్ట్రంలో తీసుకున్న అనేక ప్రజాకర్షక చర్యలు.. గతంలో తాను ఇచ్చిన హామీలకు నకలు అని విమర్శించారు. బయటి వ్యక్తుల నియంత్రణలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దెదించాలని పిలుపునిచ్చారు. అవినీతి, శాంతిభద్రతలపై రాజీలేని వైఖరిని అవలంబిస్తానని తెలిపారు.

ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ చేసిన అనుచిత వ్యాఖ్యలను భాజపా తీవ్రంగా ఖండించింది. ఆయన వీధి రౌడీలా మాట్లాడారంటూ మండిపడింది. ప్రధానికి ఓటు వేసిన ప్రతి వ్యక్తిని ఆయన అవమానించారు. ఓటర్లను, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయి. కాంగ్రెస్, రాహుల్ గాంధీ చొరబాటుదారులకు బహిరంగంగా అండగా నిలుస్తున్నారని దుయ్యబట్టింది.

# రాష్ట్రంలో పడకేసిన పాలన

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చినవి ఆరు, ఏడు వేలు కూడా లేవు. యువతులకు స్కూటీ అన్నారు.. మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని మాట తప్పారు. ఈ పైసలు ఎక్కడికి పోయా యని మహిళలు ఎదురు చూస్తున్నారు. ఫ్రీ బస్ అని చెప్పి మహిళలకు ఫ్రీ ఇచ్చి.. పురుషులకు రేట్లు పెంచారు. భార్యకుఫ్రీ ఇచ్చి భర్త నుంచి ఆ డబ్బులు లాక్కుంటున్నారు.

తులం బంగారం ఇచ్చే బాపతు కాదని మేం ముందే చెప్పాం.. అదే నిజమైంది. ఇందిరమ్మ రాజ్యం అని ఒక్క ఇల్లు కట్టలేదు కానీ.. వేలాది ఇళ్లు మాత్రం కూల్చేశారు. పెద్దల ఇల్లు కనిపించవు.. రేవంత్ రెడ్డి అన్న ఇల్లు కనిపించదు.. పేదల ఇల్లు కూలగొట్టేశారు. ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలంటే జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్‌ను గెలిపించాలి. ఇది కారుకు, బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్న ఎన్నికలు. రెండేళ్ల కిందట ఇలానే ప్రజలు మోసపోయారు. ఒక్క హైదరాబాద్ ప్రజలే కాంగ్రెస్ మాటలు విని మోసపోలేదు. కాంగ్రెస్‌ను నమ్మొద్దని హైదరాబాద్ వాసులు అన్ని సీట్లలో ఆ పార్టీని ఓడించారు. ఇప్పుడు కూడా కాంగ్రెస్ కొత్త కొత్త వేశాలు వేసుకుంటోంది.

మంత్రులు గల్లీ లీడర్ల లాగా తిరుగుతున్నారు. పెళ్లిళ్ళు పేరంటాలకు వెళ్లడం తప్ప.. మా దగ్గర నయా పైసలు లేవని కాంగ్రెస్ ఎమ్మెల్యేనే చెబుతున్నారు. కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ గెలిచి ఏడాదిన్నర అయ్యింది.. ఒక్క పనీ చేయలేదు. వెయ్యి కోట్లు ఇస్తామని చెప్పి వాళ్లను మోసం చేశారు. అమ్మకు అన్నం పెట్టనోడు.. చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తడా..? మా దగ్గర పైసలు లేవు.. మాకు పైసలు ఇవ్వండని వరల్డ్ బ్యాంక్‌కు ఆ పార్టీ ఎమ్మెల్యేలు లేఖలు రాస్తున్నారు.

ఇక్కడ పోటీ చేసే అభ్యర్థి పైసలు తెస్తా అని చెబుతున్నడు. అసలు రేవంత్ రెడ్డి దగ్గరనే డబ్బులు లేకపోతే.. ఇక ఈయన ఎక్కడి నుంచి డబ్బులు తీసుకు వస్తాడు. మేం ఎంత అభివృద్ధి చేశామో చెప్తాం.. మీరేం చేశారో చెప్పే దమ్ముందా..? ప్రజలను అంగడి సరుకులా కొని.. ఎన్నికలో గెలిచేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. స్వయంగా క్యాండిడేటే బెదిరింపులకు దిగుతున్నడు. ఇప్పుడే ఇలా ఉంటే.. తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందో ప్రజలు ఆలోచించాలి. పైసలు ఇచ్చి గెలవాలని ప్రయత్ని స్తున్నారు. అక్క, చెల్లి, మామ, అల్లుడు అంటూ చేతిలో పైసలు పెట్టే ప్రయత్నం చేస్తారు. పైసలు ఇస్తే తీసుకోండి.. ఓటు మాత్రం బీఆర్ఎస్‌కు వేయండి. మోసాన్ని మోసంతోనే జయించాలి.

రెండు వేలు తీసుకొని.. మిగితా 58వేలు ఎప్పుడిస్తారని ప్రశ్నించండి. మీకు ఇవ్వాల్సిన బాకీ డబ్బుల గురించి గట్టిగా నిలదీయండి. 4 లక్షల మంది ఓటర్ల వైపు.. నాలుగు కోట్ల మంది ప్రజలు చూస్తున్నారు. ఇప్పుడు మీరు బీఆర్ఎస్‌కు ఓటేస్తే.. కాంగ్రెస్‌కు బుద్ధి వస్తుంది. మేం తప్పు చేశాం.. ప్రజలు కోపంగా ఉన్నారని అర్థమవుతుంది.

పొరపాటున కాంగ్రెస్‌కు ఓటేస్తే.. మేం మోసం చేసినా.. ఇక్కడ బీఆర్ఎస్ గెలిస్తే.. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలవుతాయి..? కత్తి వాళ్లకు ఇచ్చి యుద్ధం మమ్మల్ని చేయమంటే ఎలా..? కత్తి మాకు ఇవ్వండి.. వాళ్లతో యుద్ధం చేసే బాధ్యత మాది. ఇప్పుడు కాంగ్రెస్‌కు ఓటేస్తే మళ్లీ నష్టపోయేది ప్రజలే. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి.

ఇక్కడ బీఆర్ఎస్ గెలిస్తే ఏమైనా జరగొచ్చు.. మళ్లీ మూడేళ్ల వరకు వెయిట్ చేయాల్సిన అవసరం కూడా రాకపోవచ్చు. రెండేళ్లలో ఏ ఒక్కరైనా సంతోషంగా ఉన్నారా..? ఎస్సీలు, ఎస్టీలు, ముస్లింలు, మహిళలు, వృద్ధులు ఇలా అందరూ బాధపడుతున్నారు. కోటి మంది కోటీశ్వరులను చేయడం ఏంటో కానీ.. మహిళలకు ఇస్తామన్నవి ఇచ్చేయండి. మాట ఇచ్చి మోసం చేసిన వాళ్ల వెంటపడాలి. భర్త చనిపోతే భార్యకు బాధ ఉండదా..? ఆమె మీద కామెంట్ చేయడానికి మంత్రులకు సిగ్గు ఉండాలి. వాళ్ల కుటుంబంలో ఎవరైనా చనిపోతే కాంగ్రెస్ నేతలకు బాధ కలగదా..? జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ దొంగ ఓట్లు రాయించినట్లు తెలిసింది. కాంగ్రెస్ అభ్యర్థి సోదరుడికే మూడు ఓట్లు ఉన్నాయంటా..? 12, 13 వేల దొంగ ఓట్లు సృష్టించారు.

ప్రజలు ఎలాగూ ఓటేయరని తెలిసి.. దొంగ ఓట్లతో గెలవాలని చూస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా లేకపోతే.. మీ ఓటు కూడా ఎవరో ఒకరు వేసేస్తారు. అది జరగకుండా మీరే వచ్చి ఓటు హక్కు వినియోగించు కోవాలి.మున్నూరు కాపులను కేసీఆర్ ఎలా చూసుకున్నారో మీకు కూడా తెలుసు. మున్నూరు కాపులకు సముచిత గౌరవం, సముచిత ప్రాధాన్యం ఇచ్చిన ఘనత కేసీఆర్‌దే. రూ.73వేల కోట్లు రైతుబంధు రూపంలో రైతుల అకౌంట్లు వేసిన ఘనత కేసీఆర్‌దే. రైతులకు దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని మంచి పనులు కేసీఆర్ చేశారు.

ఈ ప్రభుత్వంలో కరెంటు కూడా సరిగా ఉండట్లేదు. జీహెచ్ఎంసీ ఎన్నికల తర్వాత ఫ్రీ వాటర్ స్కీం కూడా ఎత్తేస్తారు. ఏదో ఇంటర్వ్యూలో రేవంత్ రెడ్డే ఈ విషయాన్ని బయటపెట్టారు. ఒక్క కొత్త రోడ్డు లేదు.. కొత్త బ్రిడ్జ్ లేదు.. కొత్త బిల్డింగ్ కట్టలేదు. కానీ.. కేసీఆర్ కట్టిన బిల్డింగ్‌లను మాత్రం ఓపెన్ చేస్తున్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అంటూ బీసీలను మోసం చేస్తున్నారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేస్తేనే ఇది జరుగుతుందని మేం ముందే చెప్పాం. అయినా.. వాళ్లు నాటకాలు ఆడి మోసం చేసే ప్రయత్నం చేశారు. చివరికి ఈ ప్రయత్నాన్ని సుప్రీంకోర్టు ఆపేసింది. బీసీలకు రూ.20వేల కోట్లు ఐదేళ్లలో లక్ష కోట్ల బడ్జెట్ అన్నారు.. అదెందుకు ఇవ్వరు. ఆయన చేతిలో లేని ముచ్చట చెప్తూ.. ఇవ్వాల్సిన వాటి గురించి మాట్లాడరు. పార్లమెంట్‌లో బిల్లు పెడితే మేం కూడా మద్దతు ఇస్తామని చెప్పాం. కానీ.. ఆ ప్రయత్నాన్ని మాత్రం రేవంత్ రెడ్డి చేయట్లేదు. నవంబర్ 11న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి. భవిష్యత్తులో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలి. నవంబర్ 11న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి. భవిష్యత్తులో కేసీఆర్ ను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలి.

# గూఢచర్యానికి పాల్పడుతున్న వ్యక్తి

### పసిగట్టి అరెస్ట్ చేసిన ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ,అక్టోబర్29(వార్త వేదిక సూర్య): గూఢచర్యానికి పాల్పడడమే గాకుండా నకిలీ పాస్‌పోర్ట్ రాకెట్ నడుపుతోన్న 59 ఏళ్ల వ్యక్తిని దిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. విదేశీ అణు శాస్త్రవేత్తలతో అతడికి సంబంధాలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. నిందితుడి పేరు మహమ్మద్ అదిల్ హుస్సైనీగా గుర్తించారు.. ఇంకా రెండుమూడు మారుపేర్లతో విదేశాల్లోని అణుశాస్త్రవేత్తలను పలుమార్లు సంప్రదించినట్లు, పాక్ సహా పలు దేశాలకు పర్యటించినట్లు వెల్లడించాయి. అతడు భారత్‌కు చెందిన సున్నితమైన సమాచారాన్ని చేరవేస్తున్నాడని అధికారులు అనుమానిస్తున్నారు. తనిఖీల్లో భాగంగా అతడి నుంచి అసలు, నకిలీ పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకున్నారు. దేశ భద్రతలో కీలకమైన సంస్థలకు సంబంధించిన ఐడీ కార్డులు కలిగిఉన్నట్లు గుర్తించారు. అతడి నెట్‌వర్క్ ఝార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్ నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తోందని, అక్కడ నకిలీ ఐడీలు, పాస్‌పోర్టులను తయారుచేస్తున్నారని తెలిపారు. రష్యా అణుశాస్త్రవేత్త నుంచి డిజైన్‌ను ఇరాన్ శాస్త్రవేత్తకు విక్రయించినట్లు దర్యాప్తులో భాగంగా అదిల్ వెల్లడించినట్లు సమాచారం. అలా వచ్చిన సొమ్మును దుబాయ్‌లో పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది.

అదిల్‌తో పాటు అతడి సోదరుడు అక్తర్ సున్నితమైన సమాచారాన్ని విక్రయించి, నకిలీ పత్రాల ద్వారా పలు దేశాలకు చెందిన పాస్‌పోర్టులు పొందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అక్తర్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. కేఫ్‌ను నడుపుతోన్న మరో అనుమానితుడిని అరెస్టు చేయగా.. నెట్‌వర్క్‌లో భాగమైన మిగిలినవారు పరారీలో ఉన్నారని పోలీసు అధికారి ప్రమోద్‌సింగ్ కుశ్వాహ్ మీడియాకు వెల్లడించారు. ఈ నెట్‌వర్క్ ద్వారా ఎంత మందికి నకిలీ పాస్‌పోర్టులు అందాయనే దిశగా పోలీసులు ఆరా తీస్తున్నారు.



## కూలిన బ్రహ్మంగారి ఇల్లు

బ్రహ్మంగారిమఠం,అక్టోబర్29(వార్త వేదిక సూర్య): భారీ వర్షాలకు పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నివాస గృహం మంగళవారం రాత్రి కుప్పకూలింది. కడప జిల్లా కందిమల్లయ్యపల్లె గ్రామంలో ఉన్న ఆయన ఇల్లు దక్షిణ వైపు గోడ కూలిపోయింది. 1979, 1982లో ముగ్గురు యాత్రికులు పాత ఇంటి స్థానంలో గదులు, వరండాను రాతి కట్టడంతో నిర్మించారు. గోడ కూలిపోవడానికి మఠం అధికారుల నిర్లక్ష్యమే కారణమని యాత్రికులు విమర్శిస్తున్నారు. టోకెన్ రూపంలో యాత్రికుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారే తప్ప కనీసం మరమ్మతులు కూడా చేయించకపోవడం బాధకరమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మొంథా ప్రభావంతో తెలంగాణలో వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

దిశానిర్దేశం చేశారు. పలు చోట్ల కల్లాల్లో ధాన్యం ఆరబోసినందున ఎటువంటి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాల్లోనూ తగిన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో ప్రభావం ఎక్కువగా ఉండటంతో పాటు.. హైదరాబాద్, ఇతర జిల్లా ల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నందున అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గోల్కొండ, కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోవడం.. పలు రైళ్లను దారి మళ్లించినందున ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మొంథా తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న జిల్లాల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు సమన్వయం చేసుకోవాలని... కలెక్టర్లు ఆయా బృందాలకు దిశా నిర్దేశర చేయాలని సూచించారు. వాగులు, వంకలు పొంగే ప్రమాదం ఉన్నందున జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని.. లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సహాయక శిబిరాలకు తరలించాలని రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రాణ, ఆస్తి, పశు నష్టం లేకండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్‌లో ప్రజల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులపై జీహెచ్ఎంసీ, హైడ్రా, ఎస్డీ ఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది వెంటనే స్పందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.నీటి పారుదల శాఖ అధికారులు, సిబ్బంది రిజర్వాయర్లు, చెరువులు, కుంటల నీటి మట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలని.. నీటి విడుదలపై ముందుగానే కలెక్టర్లు, క్షేత్ర స్థాయి సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు.పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను ముందుగానే సిద్ధంగా ఉంచాలన్నారు. రోడ్లపై నీరు నిలిచిన ప్రాంతాల్లో, లోలెవల్ బ్రిడ్జిలు, కాజ్‌వేలపై నుంచి రాకపోకలు పూర్తిగా నిషేధించాలన్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు వాటి సమీ పంలో బారికేడ్లు ఏర్పాటు చేసి పర్యవేక్షించాల న్నారు. వర్షం నీరు నిల్వ ఉండి దోమలు, ఇతర క్రిమికీటకాలు విజృంభించి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేపట్టాలని పేర్కొన్నారు. వైద్యారోగ్య శాఖ తగినన్ని మందులు అందుబాటులో ఉంచుకోవాలని... అవసరమైన చోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## 8వ వేతన సవరణ గొప్ప నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కృషికి సరైన గుర్తింపు ఇవ్వడమే కాకుండా, వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో ఈ నిర్ణయం కీలక మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. వేతన సవరణతో ఉద్యోగుల్లో ఉత్సాహం పెరగడంతో పాటు, కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉత్పాదకత పెరిగి ప్రజా సేవల నాణ్యత మరింత మెరుగవుతుందన్నారు. ఉద్యోగుల ఆర్థిక స్థితి మెరుగుపడటం ద్వారా దేశీయ వినియోగం పెరిగి, ఆర్థిక వృద్ధికి కూడా ఊతమిస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రభుత్వం ప్రజల సంక్షేమం, ఉద్యోగుల ప్రయోజనాల కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తోందని కిషన్ రెడ్డి తెలిపారు. ఆయన పేర్కొంటూ మోదీ గారు నాయకత్వం వహించిన తర్వాత 2016లో 7వ వేతన సవరణ కమిషన్ ద్వారా ఉద్యోగులకు అనుకూలమైన సంస్కరణలు తీసుకువచ్చారు. 2006లో జరిగిన 6వ పీఆర్సీలో కనీస వేతనం రూ.7 వేలుగా ఉండగా, 7వ పీఆర్సీలో దాన్ని రెండున్నర రెట్లు పెంచి రూ.18 వేలుగా నిర్ణయించారు. అంతేకాకుండా, కనీసం 3 శాతం ఇంక్రిమెంట్ తప్పనిసరిగా ఇవ్వాలనే నిర్ణయం కూడా మోదీ ప్రభుత్వంలోనే తీసుకున్నారని గుర్తుచేశారు. ఇప్పుడు 8వ పీఆర్సీ ద్వారా కేంద్ర ప్రభుత్వం మరిన్ని మార్పులు తీసుకువచ్చిందని, ఈ నిర్ణయం ద్వారా 50 లక్షలకు పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 65 లక్షలకు పైగా పెన్షనర్లు లబ్ది పొందనున్నారని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ నిర్ణయం దేశవ్యాప్తంగా ఉద్యోగుల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి ద్విగుణీకృత ఉత్సాహాన్ని నింపుతుందన్నారు.

## సిఎం, పిఎం సీటు ఖాళీగా లేదు

(మొదటి పేజీ తరువాయి)

రాజకీయాల్లో ఏ సీటూ ఖాళీగా లేదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. నీతీశ్ కుమార్ బిహార్ ముఖ్యమంత్రిగా కొనసాగుతారని, కేంద్రంలో నరేంద్రమోదీ ప్రధానిగా ఉంటారని వ్యాఖ్యానించారు. బిహార్‌లో దర్భంగాలో బుధవారం జరిగిన ర్యాలీలో అమిత్ షా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, ఆర్జేడీపై ఆయన వ్యంగ్యాస్త్రాలు గుప్పించారు. ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తన కుమారుడు తేజస్వీయాదవ్‌ను ముఖ్యమంత్రిని చేయాలను కుంటున్నారని, కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ తన కుమారుడు రాహుల్ గాంధీని పీఎంను చేయాల నుకుంటున్నారని అమిత్ షా విమర్శించారు. కానీ ఆ రెండు స్థానాలు ఖాళీగా లేవంటూ మహాగఠ్‌బంధన్ పార్టీలను ఎద్దేవా చేశారు. ప్రధాని మోదీ బిహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇచ్చి.. రాష్ట్ర ప్రతిష్ఠను పెంచారని ఈ ఎన్నికల ప్రచారం సందర్భంగా అమిత్‌షా వ్యాఖ్యానించారు. అలాగే పహల్గాం దాడి గురించి ప్రస్తావించారు. ఆ ఉగ్రదాడి జరిగిన వెంటనే మోదీ ఆపరేషన్ సిందూర్‌కు ఆదేశాలు ఇచ్చారని గుర్తుచేశారు.

## రహదారి నిర్మాణాల వద్ద క్యూఆర్ కోడ్

(మొదటి పేజీ తరువాయి)

ఎందుకు స్పందించాలని నితిన్ గడ్కరీ చమత్కరించారు. అందుకే రోడ్లకు సంబంధించిన సమాచారమంతా ప్రజలకు బహిర్గతం చేయాలనే ఉద్దేశంతో ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అప్పుడే రోడ్ల నిర్మాణంలో అవినీతికి పాల్పడే అధికారులకు ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. రోడ్లపై క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేయడం వల్ల దానిని మంజూరు చేసిన మంత్రి ఎవరు, దాని నిర్మాణం కోసం పనిచేసిన కార్యదర్శులు, కాంట్రాక్టర్లు, ఇంజినీర్లు వారి ఫోన్ నంబర్లు, ఫొటోతో సహా అన్ని వివరాలు ప్రజలకు, విలేకరులకు అందుబాటులో ఉంటాయి. ఆయా రోడ్లపై ఏదైనా సమస్య వస్తే వారు నేరుగా ఆ అధికారులనే ప్రశ్నించే అవకాశం ఉంటుందని అన్నారు. ఇది ప్రధానంగా ప్రజల్లో బాధ్యతను పెంచుతుందని, వివరాలు తెలుసుకునే వీలుంటుందని అన్నారు.

## మూసీనదికి వరదపోటు - ఏడుగేట్లు ఎత్తి నీటి విడుదల

నల్లగొండ,అక్టోబర్29(వార్త వేదిక సూర్య): నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలోని మూసీ నదికి వరద పోటెత్తింది. ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో పాటు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నుంచి మూసీకి భారీగా వరద నీరు వచ్చి చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో మూసీ ప్రాజెక్టు ఏడు గేట్లను 4 అడుగుల మేర ఎత్తి దిగువకు 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ ప్రాజెక్టు 3, 4, 5, 6, 8, 10, 12 క్రస్ట్ గేట్లను 4 అడుగుల మేర ఎత్తినట్లు అధికారులు తెలిపారు. గేట్లను ఎత్తడంతో దిగువ ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. జూలూరు- రుద్రవెల్లిలో లెవల్ బ్రిడ్జి వద్ద మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో పోచంపల్లి- బీబీనగర్ మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు బీబీనగర్, భువనగిరికి వెళ్లేందుకు పెద్ద రావులపల్లి నుండి చుట్టూ తిరిగి వెళుతున్నారు. మూసీ ఉధృతితో అధికారులు ఇరు వైపులా భారీ కేడ్లు ఏర్పాటు చేశారు.

అధికారులు పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY








## హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీ.సి. సజ్జనార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన రాజేంద్రనగర్ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**మైలర్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 29(వార్త వేదిక సూర్య):** రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి బుధవారం హైదరాబాద్‌లో సీనియర్ ఐపీఎస్ అధికారి, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీ.సి. సజ్జనార్ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, తోకల శ్రీనివాస్ రెడ్డి కమిషనర్ సజ్జనార్‌కి పుష్పగుచ్ఛం అందించి, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నూతన బాధ్యతలు స్వీకరించినందుకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## ఆకాల వర్షాలకు తడిసిన ధాన్యం ఆందోళనలో రైతులు

**మోత్కూరు, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):** మోత్కూరు మండలం దాచారం గ్రామంలో రెండు రోజులు కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామంలోని శ్రీ రామ సముద్రం చెరువు బుధవారం నాడు అలుగుపోస్తుంది. ఈ వర్షాలు రాకముందే



గతంలో మాదిరిగానే చెరువు బండ పైన ఐకెపి సెంటర్ ఏర్పాటు చేయడంతో రైతులు తమ ధాన్యాన్ని ఐకెపి సెంటర్ కు విక్రయించడానికి ఆరబోశారు. చెరువు అలుగు పోయడంతో రైతులు త్రీవ ఇబ్బందులు పడుతున్నారు.ఆరబెట్టిన ధాన్యాన్ని అకాల వర్షానికి తడవడంతో రైతులు ఎగువ ప్రాంతాలకు తరలించారు.

## మళ్లీ కృంగిన మోత్కూరు-తిరుమలగిరి ప్రధాన రహదారి

**మోత్కూరు, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):**

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని మోత్కూరు-తిరుమలగిరి ( చెరువు కట్ట) ప్రధాన రహదారి మళ్ళీ కృంగిపోయింది. గత రెండునెలలుగా కురుస్తున్న భారీ వర్షాలకు ఈ రోడ్డు ఒకవైపు పూర్తిగా కృంగిపోగా ఇరిగేషన్ అధికారులు







సరిగ్గా ఈ నెల రోజుల క్రితం తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు.గత రెండు రోజులుగా కురుస్తున్న ఆకాల భారీ వర్షాలకు బుధవారం నాడు మళ్లీ కృంగి పోయింది. దీంతో ఇటువైపు వెళ్తున్న తిరుమలగిరి, సూర్యాపేట, తొర్రూరు, మహబూబాబాద్ చెందిన ఆర్టీసీ బస్సులను ఈ రూట్ లో వెళ్లనీయకుండా భారీ కేడ్లను స్థానిక పోలీసులు ఏర్పాటు చేసి, మండలంలోని అనాజీపురం మీదుగా వాహనాలతో పాటు ఇతర పెద్ద, పెద్ద వాహనాలను పోలీసులు మళ్లించారు.

## పొంగుతున్న మోత్కూరు బిక్కేరు వాగు

**మోత్కూరు, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):** గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మోత్కూరు బిక్కేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈవాగు ఒకింత ఖరీఫ్ వరి పంటలకు కొంతమేర న్యాయం జరుగుతుందని కానీ...ప్రస్తుత వరి పంటలకు రైతాంగానికి త్రీవ నష్టం జరుగుతుందని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఈ వాగు గురువారం నాటికి మరింత పెరిగే అవ కాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండి రైతులకు, వాహనదారులకు ,జాగ్రత్తగా ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



# నిబంధనలు సవరించి రైతులు పత్తి పంటను స్వేచ్ఛగా అమ్ముకునే వెసులుబాటు కల్పించాలి.

### రైతు సంఘం మండల కార్యదర్శి దడిపల్లి ప్రభాకర్

**మోత్కూరు, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):**
పత్తిరైతులు పత్తిని అమ్ముకునేందుకు కాపాస్ కిసాన్ యాప్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని... ఈ నిబంధనలు సవరించి రైతులు తమ పంటను స్వేచ్ఛగా అమ్ముకునే వెసులుబాటు కల్పించాలని, రైతు సంఘం మండల కార్యదర్శి దడిపల్లి ప్రభాకర్ కేంద్ర ప్రభు త్వాన్ని డిమాండ్ చేశారు. ఆయన బుధవారం నాడు మోత్కూరులో విలేఖరులతో మాట్లాడుతూ. రైతులు తమ పత్తిని సీసీఐ కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోవాలంటే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాపాస్ కిసాన్ యాప్ రైతుల పట్ల శాపంగా మారిందన్నారు.
పత్తిని అమ్మాలంటే రైతులు వ్యక్తిగతంగా కాపాస్ కిసాన్ యాప్ ప్లే స్టోర్ నుండి డౌన్లోడ్ చేసుకొని తమ మొబైల్ నెంబర్‌తో లాగిన్ అవ్వాలని, ఆ తదుపరి స్లాట్ బుక్ చేసుకొని మిల్లులకు పత్తిని తీసుకొని పోవాలనే నిబంధన వల్ల రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాలలో అమ్ముకోలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పత్తి అమ్మాలంటే , ఫోన్ నెంబర్ అక్టివేషన్ లేనివారు ఫోన్ నెంబర్ అప్డేషన్ కొరకు వ్యవసాయ విస్తీర్ణ అధికారిని సంప్ర దించాలంటే అవగాహన లేని రైతులు పంటలను మిల్లులకు తీసుకెళ్లి నిబంధనల మూలంగా వెనుతిరిగి దళారులను ఆశ్రయించే అవకాశం ఉందన్నారు. రైతులు దాదాపు నిరక్షరాస్యులై ఉంటారని అందులో మొబైల్ సైతం ఉండదని, అలాం టప్పుడు ఇలాంటి నిబంధనలతో ఇబ్బందుకు గురి చేయడం ఇది కేంద్ర ప్రభుత్వానికి తగునా ప్రశ్నించారు. ఇప్పటికే వర్షాల మూలంగా రైతులు దాదాపుగా పత్తి పంటను కోల్పోయారని, ఉన్నా ఏరిన పత్తి కూడా సరిగా ఎండలేదన్నారు. ఇలాంటి పరిస్థితిలో ఉన్న రైతులను సిసిఐ కేంద్రాలలో నిబంధనలతో ఇబ్బందులు పెట్టడం సరికాదని అన్నారు. ఈ నిబంధనలు సరిచేసి కిసాన్ యాప్‌తో సంబంధం లేకుండా నేరుగా



మిల్లర్లు కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టాలని ప్రభాకర్.కోరారు.





# అవినీతి నిర్మూలనపై విద్యార్థుల అవగాహన

### - శివరాంపల్లి హై స్కూల్లో పోటీలు

**మైలర్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 29(వార్త వేదిక సూర్య):**
జిల్లా పరిధిలో అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శివరాంపల్లి హై స్కూల్లో వ్యాసరచన మరియు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ పోటీలలో "సమాజంలో అవినీతిని ఎలా నిర్మూలించాలి? అవినీతిరహిత భారత దేశాన్ని ఎలా నిర్మించాలి?" అనే అంశాలపై విద్యార్థులు సృజనాత్మకంగా తమ ఆలోచనలను వ్యక్తపరిచారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీంద్ర రావు హాజరై విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ప్రధానం చేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా ఉపాధ్యాయులు రూపాదేవి, మొగులయ్య, సుధాకర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శంకర్ రాథోడ్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భూక్య శ్రీను నాయక్, విజిలెన్స్ అధికారులు శిఖా గోయల్ (ఐ పి ఎస్, డి జి), శ్రీనివాస్ రెడ్డి (ఆర్ వి & ఈ ఓ), ఎస్. వెంకన్న (ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్), వెంకట్ రెడ్డి, రామకృష్ణ (ఎం ఆర్ ఓ) అరుణ (ఎంపీడీఓ), దేవిక (ఎంపీడీఓ), పీడీ గాంధీ నాయక్ సుదర్శన్, వెంకటయ్య, నర్సింహాచారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పొడిచేడుకు నైట్ హాల్ట్ బస్సు పునరుద్ధరణ

**మోత్కూరు, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):**
మోత్కూరు మండలంలోని పొడిచేడు గ్రామం నుండి ఉదయం 4.00 గంటలకు హైదరాబాద్ కు, తిరిగి సాయంత్రం 6 గంటలకు ఉప్పల్ నుండి పొడిచేడు కు బస్ సౌకర్యం యాదగిరిగుట్ట డిపో




ఆర్టీసీ అధికారులు మంగళవారం రాత్రి పునరుద్ధరించారు. ఈ బస్సును బుధవారం ఉదయం 4.00 గంటలకు మాజీ ఎంపీపీ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వంగాల సత్యనారాయణ ఈ బస్సును ప్రారంభించారు.
గత కొన్ని ఏండ్ల నడుస్తున్న ఈ బస్సును ఆపేశా అధికారులు అర్ధతరంగా నిలిపివేయడంతో ఈ విషయాన్ని పొడిచేడు గ్రామస్తులు ఇటీవల రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి ప్రభాకర్ ఆదేశాలతో పొడిచేడు గ్రామానికి హైదరాబాద్ నైట్ హల్ట్ బస్‌ను పునరుద్ధరించినందుకు వంగాల సత్యనారాయణకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు జిట్ట అంజయ్య,, మాజీ సర్పంచ్ లెంకలపల్లి బిక్షం, మాజీ ఉప సర్పంచ్‌లు చిందాల ఎల్లయ్య, కప్పె వెంకన్న, సోషల్ మీడియా కోఆర్డినేటర్ రచ్చ శివ కుమార్, మాజీ వార్డు సభ్యులు బండ లింగయ్య, చామకూర వీరస్వామి,కట్టంగూర్ సైదులు,వంగాల సత్తయ్య,నల్ల రామనర్సయ్య, బండ కుమార్ జిట్టా సైదులు, ఏనిగ మత్స్యగిరి బిఆర్ఎస్ నాయ కులు మల్లం సైదులు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మిత్ర సభ్యులు మల్లం అనిత, ఫీల్డ్ అసిస్టెంట్ కమ్మంపాటి వీరస్వామి,, స్థానికులు బుంగ సైదులు, లెంకలపల్లి శశి పాల్గొన్నారు.



# ప్రజలు అత్యవసరమైతే తప్ప.. ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావొద్దు

### ఆర్ డి.ఓకృష్ణారెడ్డి సూచన

**మోత్కూరు, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):**
మొంతా తుఫాను ప్రభావంతో గత రెండు కురుస్తున్న భారీ వర్షాలు నేపథ్యంలో ప్రజలు అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రావొద్దని భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి అన్నారు.. బుధవారం నాడు ఆయన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. రైతులు ధాన్యం పై టార్పాలిన్ లు కప్పి ఉంచాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన వెంటనే ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో భారీ వర్షాల నేపథ్యంలో ఆర్డీవో సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ పరిపాలన అధికారులు అందుబాటులో ఉండాలని అన్నారు. రెవెన్యూ సిబ్బంది భారీ వర్షాల నేపథ్యంలో స్థానికంగా ఉంటూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంట తహశీల్దార్ పి.జ్యోతి, మున్సిపల్



కమీషనర్ కె.సతీష్ కుమార్, మార్కెట్ కార్యదర్శి ఉమా మహేశ్వరరావు, సింగిల్ విండో కార్యదర్శి కె. వరలక్ష్మి, ఆర్ .ఐ .సుమన్ ,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - ఎమ్మెల్యే సామేల్

**మోత్కూరు, అక్టోబర్ 29(వార్తా వేదిక సూర్య):** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేల్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ వర్షాల కారణంగా ఎక్కువగా ఉన్నందువలన లోతట్టు ప్రాంత ప్రజలు కుంటలు చెరువు



దగ్గర ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు శిథిలా వస్థలో ఉన్న ఇండ్లలో పూరి గుడిసెలలో నివసించకుండా ప్రత్యేక మైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన కోరారు. నియోజకవర్గంలో అన్ని మండల గ్రామాలల్లో పాడుబడ్డ ఇండ్ల కింద తల దాచుకో వద్దని సూచించారు. కరెంట్ వైర్లు విద్యుత్ స్తంభాలు ప్రమాద భరితంగా కనిపిస్తున్న ఏ ఇతర ,బయటికి రాకుండా సాధ్యమైనంత వరకు భారీ వర్షాలు తగ్గేవరకు జాగ్రత్త వహించాలని అత్యవసరం ఉంటే తప్ప బయటకు రావద్దని సామేల్ విజ్ఞప్తి చేశారు, మ్యాన్ హోల్, డ్రైనేజీలను చూసుకొని వెళ్లాలని, ఉధృతంగా ప్రవహించే చెరువులు వాగుల వద్దకు వెళ్లవద్దని, వ్యవసాయ, వివిధ పనులకు వెళ్లేటప్పుడు విష సర్పాలతో జాగ్రత్త ఉండాలన్నారు.

# తుపాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**సుద్దాల వాసి బుర్ర లక్ష్మణ్ గౌడ్ అలియాస్ జవాహర్ నగర్ బీజే ఆర్ నగర్ బి ఆర్ ఎస్ యూత్ నాయకులు.**



గుండాల, అక్టోబర్ 29(వార్త వేదిక సూర్య): మొంథా తుఫాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బుర్ర లక్ష్మణ్ గౌడ్ కోరారు.సుద్దాలలో బుధవారం నాడు కాంగ్రెస్ పార్టీ నుండి బి ఆర్ పార్టీకి పలువురు నాయకులు చేరిన సమక్షంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు రైతులు పెట్టుబడులు పెట్టి ఎంతో కష్టపడి సాగు చేసిన పంట చేతికి వచ్చే సమయంలో పంటలు నీటి పాలు అయ్యాయని ఆయన చెప్పారు. ప్రభుత్వం వెంటనే పంట నష్టం అంచనా వేసి రైతులకు తగిన నష్టపరిహారం అందించాలి అన్నారు.

రైతుల కష్టార్జితం పంటలు తుడిచి పెట్టుకుపోయిన ఈ పరిస్థితిలో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే వ్యవసాయ నష్టం అంచనా వేసి ప్రతి రైతుకు ఎకరాకు సుమారు 30 వేల రూపాయలు నష్టపరిహారం ప్రకటించాలి, అని ఆయన డిమాండ్ చేశారు.

రైతుల కష్టాన్ని గుర్తించి పంట నష్టాన్ని ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో ఆదుకోకపోతే బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులను సమీకరించి ఆందోళనలు చేస్తాం అని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న, బీఆర్ఎస్ సుద్దాల గ్రామ శాఖ అధ్యక్షుడు కొండపల్లి మొగులాల్,ఉప్పల్ బి ఆర్ యెస్ డివిజన్ ప్రెసిడెంట్ గణగాని అంజయ్య,ఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎండీ. ఖలీల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మందడి రామకృష్ణారెడ్డి, మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ గడ్డమీది పాండరి,మాజీ ఎంపీటీసీ బడక మల్లయ్య,4వ వార్డు సొసైటీ నెంబర్ బుర్ర రాజు గౌడ్,ఎగమాటి వేణు గోపాల్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మూగల శ్రీనివాస్,యూత్ నాయకులు కాసం నాగేష్,మహోదయ్ గౌడ్,నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే 48 గంటలు అప్రమత్తంగా ఉండాలి

**మొంతా వర్షాలకు ప్రజలు చెరువు, కుంటల దగ్గర ఉన్న లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.**

**- గుండాల ఎస్సై ఏం తేజం రెడ్డి హెచ్చరిక...**



గుండాల, అక్టోబర్ 29(వార్త వేదిక సూర్య): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న మొంతా వర్షాల కారణంగా గుండాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గుండాల ఎస్సై ఏం తేజం రెడ్డి ఎచ్చరిక పిలుపునిచ్చారు,విలేకర్ శ్రీనివాస్ గౌడ్ తొ మాట్లాడుతూ ఈ వర్షాల కారణంగా ఎక్కువగా ఉన్నందువలన లోతట్టు ప్రాంత ప్రజలు కుంటలు చెరువు దగ్గర ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ప్రజలు శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో పూరి గుడిసెలలో నివసించకుండా ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన కోరారు. అంతేకాక గుండాల మండల గ్రామాల్లో పాడుబడ్డ ఇండ్ల కింద తల దాచుకోవద్దని కరెంటు వైర్లు విద్యుత్ స్తంభాలు ప్రమాద భరితంగా కనిపిస్తున్న ఏ ఇతర ప్రాంతాల్లో ప్రజలు ఈ వర్షాలకు తల దాచుకోకుండా వెనుక ముందు ఆలోచించుకోవాలని ఆయన సూచించారు,బయటికి రాకుండా సాధ్యమైనంత వరకు మోన్తా వర్షాలు తగ్గేవరకు జాగ్రత్త వహించాలని అత్యవసరం ఉంటే తప్ప బయటకు రావద్దని ఆయన విజ్ఞప్తి చేశారు,

ఈ వర్షాల కారణంగా గుండాల మండల మరియు ప్రాంత శివారులో ప్రజలను చైతన్యం చేస్తూ వర్షాలకు ప్రమాదాలను తెలుసుకోకుండా నివారించే దిశగా పోలీసులు కృషి చేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా అన్నారు, ప్రజల శ్రేయస్సు కోసం పోలీసులు నిరంతరం ప్రజా సమస్యల పట్ల దృష్టి కేంద్రీకరిస్తున్నామని ఇందులో భాగంగానే వర్షాల పట్ల కూడా పోలీసులు స్పందించడం జరుగుతుందని ఎవరైనా ఎక్కడైనా ఎలాంటి ప్రమాదం జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన మండల గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు,

# ఎల్ఐసిని కార్పొరేట్ అదానీకి అప్పగించిన కేంద్ర ప్రభుత్వం..

**- సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి**




భువనగిరి, అక్టోబర్ 29(వార్త వేదిక సూర్య): కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఎల్ఐసిలో ఉన్న రూ.33 వేల కోట్ల ప్రజల బీమా సొమ్మును ఆదానీ కంపెనీకి కట్టబెట్టి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగ వ్యవహరిస్తుందని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి ఆరోపించారు.

బుధవారం రోజున సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కౌన్సిల్ సమావేశం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఎండీ ఇమ్రాన్ అధ్యక్షతన నిర్వహించారు .ఈ సమావేశానికి సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఎల్ఐసి అనేది కోట్లాది ప్రజల నమ్మకానికి ప్రతీక. ఈ సంస్థను ప్రైవేటు కంపెనీల చేతుల్లోకి వదిలేయడం అంటే ప్రజల భవిష్యత్తుతో ఆటలాడటమే. కేంద్ర ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్లకు బహుమతిగా ఇస్తూ, ప్రజా రంగ సంస్థలను క్రమంగా బలహీనపరుస్తోంది అని, ప్రభుత్వం నిర్ణయాని వ్యతిరేకిస్తూ ప్రజలు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. ఖమ్మం వేదికగా డిసెంబర్ 26న జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) శాతాబ్ది ఉత్సవ ముగింపు బహిరంగ సభ ఓ చారిత్రాత్మక ఘట్టంగా మిగిలిపోతుందని ఇందుకోసం ప్రతి కార్యకర్త నడుం బిగించాలని ఖమ్మంకు తరలిరావాలని పిలుపునిచ్చారు.ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఆర్.ఆర్.ఆర్.లో భూములు కోల్పోతున్న రైతులను ఆదుకోవాలని, బీసీ రిజర్వేషన్ ను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలుపాలని అన్నారు.

ఈ సమావేశానికి జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్ అధ్యక్షత వహించగా కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, రాష్ట్ర సమితి సభ్యులు గోద శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రాజయ్య, కళ్లెం కృష్ణ, బండి జంగమ్మ, బచ్చనగోని గాలయ్య, చెక్క వెంకటేష్, కుసుమని హరిచంద్ర, ఏశాల అశోక్, పల్లె శేఖర్ రెడ్డి, చిగుర్ల లింగం, పెరబోయిన మహేందర్, జిల్లా సమితి సభ్యులు గాదెగాని మాణిక్యం, అన్నెపు వెంకట్, కళ్లేపల్లి మహేందర్, రేకల శ్రీనివాస్, దాసరి లక్ష్మయ్య, గోరేటి రాములు, బబ్బురి శ్రీధర్, ఆలేటి బాలరాజు, ఇంజ హేమలత, వడ్లకొండ భరతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు నేత్ర జ్యోతి చెన్నూరు లయన్స్ క్లబ్

చెన్నూర్,అక్టోబర్ 29(వార్త వేదిక సూర్య): డాక్టర్ భాస్కర్ మాదేకర్ ఉదార నేత్ర వైద్యశాల రేకుర్తి, కరీం నగర్ వారి సౌజన్యంతో, వైస్ చైర్మన్ చిదుర సురేష్ సహకారంతో






చెన్నూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య చికిత్స శిబిరం 24 అక్టోబర్ 2025 శుక్రవారం రోజున, పడమటింటి కృష్ణమూర్తి కాంప్లెక్స్ లో నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ శిబిరానికి 102 మంది హాజరై తమ పేరు నమోదు నమోదు చేసి బీపీ, షుగర్, కంటి పరీక్షల అనంతరం 85 మంది అర్హత సాధించినట్లుగా రేకుర్తి ప్రతినిధి ప్రభాకర్ ప్రకటించగా రెండు విడతల్లో మొత్తం 68 మందికి కంటి ఆపరేషన్లు విజయవంతమైనట్లు చెన్నూరు లైన్స్ క్లబ్ అధ్యక్షులు జాడి తిరుపతి తెలియజేసారు. ఈరోజు మైనారిటీ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన రిసీవింగ్ ప్రోగ్రాం సమావేశంలో చెన్నూర్ లయన్స్ అధ్యక్షులు జాడి తిరుపతి పేషెంట్లను ఉద్దేశించి మాట్లాడుతూ.. రేకుర్తి డాక్టర్ల సూచన మేరకు మందులు వాడుతూ కంటిని జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు. నవంబర్ నాలుగవ తారీఖు రోజు తప్పకుండా రేకుర్తికి వెళ్లి వారి సూచన మేరకు నడుచుకోమని తెలిపారు. ఐ పేషెంట్లకు పండ్లను పంపిణీ చేశారు. చెన్నూరు లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రోత్సహించ వలసిందిగా తెలియజేస్తూ, వచ్చే నెల 18 నవంబర్ 2025 రోజున ఉచిత నేత్ర వైద్య శిబిరం ఉంటుందని, చెన్నూరు పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలసిందిగా కోరారు. పండ్ల దాత లయన్ బెల్లంపల్లి నాగరాజ గౌడ్, సోదరి రాధికాదేవి పుట్టినరోజు సందర్భంగా గొప్ప మనస్సుతో ఐ పేషెంట్లకు పండ్లను పంపిణీ చేసినందుకు వారికి అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జోన్ చైర్ పర్సన్ లయన్ మోదుంపురం వెంకటేశ్వర్, కార్యదర్శి లయన్ సౌదం శ్రీనివాస్, కోశాధికారి లయన్ నిమ్మల సాగర్, లయన్ బెల్లంపల్లి నాగరాజాగౌడ్, లయన్ జక్కుల సత్యనారాయణ వారి వెంట వెళ్లి వచ్చిన వాలంటీర్లు తదితరులు పాలుగోన్నారు.

# భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మండల తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి**



భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 29(వార్త వేదిక సూర్య): ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దన్నారు. మూసి పరివాహక ప్రాంతాలు, వాగులు చెరువులకు వెళ్ళవద్దని, ఎలక్ట్రిక్ పోల్స్ వైర్లను తాకవద్దని సూచించారు. శిధిలమైన ఇళ్లలో ఉండకూడదని, చిన్నారులను వృద్ధులను ఒంటరిగా బయటకు పంపించవద్దని,తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దాన్యం తడవకుండా రైతులు టార్పులింగ్ కవర్లు కప్పాలని, ధాన్యం కుప్పల దగ్గర వర్షం నీరు చేరకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షాలతో పాత ఇండ్లు కూలిపోతే, తాసిల్దార్ కార్యాలయానికి వెంటనే సమాచారం అందించాలని అన్నారు. ఆయన వెంట డిప్యూటీ తాసిల్దార్ నాగేశ్వరావు, ఎం ఆర్ ఐ గుత్తా వెంకటరెడ్డిలు ఉన్నారు.

విలేకరులు కావలెను:

వార్త వేదిక సూర్య దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణలోని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను.

యాదాద్రి భువనగిరి: యాదగిరిగుట్ట, యాదగిరిగుట్ట టౌన్, యాదగిరిగుట్ట రూరల్, బొమ్మలరామారం, గుండాల, అడ్డగూడూరు, ఆలేరు, భువనగిరి, భువనగిరి రూరల్, బీబీనగర్, తిరుమలగిరి, స్వర్ణగిరి దేవాలయం, రాజాపేట మండలాల విలేకర్లు కావలెను.

నల్లగొండ : చిట్యాల, నార్కట్‌పల్లి, కనగల్, తిప్పర్తి, మిర్యాలగూడ, మిర్యాలగూడ రూరల్, మాల్, మర్రిగూడెం, చింతపల్లి, గుర్రంపోడు, కోదాడ, సూర్యాపేట, నకిరేకల్, కట్టంగూర్, హుజూర్‌నగర్, మఠంపల్లి, త్రిపురారం, చందంపేట, దిండి మండలాలలో రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

పూర్తి వివరాలకు సంప్రదించగలరు.

పోలోజు శ్రీనివాసాచారి
చైర్మన్ & ఎడిటర్.
9985389183






# శివరాంపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల క్రీడా ప్రతిభ

**- రాష్ట్ర స్థాయికి చేతన్, సబన్న ఎంపిక!**

మైలర్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 29(వార్త వేదిక సూర్య): రాజేంద్రనగర్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్.పి.హెచ్.ఎస్) శివరాంపల్లి విద్యార్థినీ విద్యార్థులు ఇటీవల నిర్వహించిన మండల స్థాయి క్రీడల్లో ఐదు బహుమతులు, జోనల్ స్థాయిలో ఏడు బహుమతులు, అలాగే జిల్లా స్థాయిలో మూడు బహుమతులు సాధించారు. అలాగే రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైన ఇద్దరు విద్యార్థులు చేతన్, సబన్న లను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మరియు అధికారులు అభినందించారు. జోనల్ ఇన్చార్జి కే. గాంగ్యనాయక్ విద్యార్థుల కృషి, ప్రతిభను ప్రశంసిస్తూ భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డీఈఓ జెడ్పిహెచ్ఎస్ శివరాంపల్లి పాఠశాలను సందర్శించి, విజేత విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో డివో సుశీలరావు, ఎంఈఓ శంకర్ నాయక్, జిహెచ్ఎం శ్రీనివాస్ నాయక్, సుదర్శన్, జనార్దన్ చారి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణాలను తొలగించాలని మున్సిపల్ కమీషనర్‌కు ఆర్డీవో ఆదేశం


మోత్కూరు, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య): మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామంలో ఇళ్ల మధ్య వర్షపు నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకున్న ఆర్డీవో కృష్ణారెడ్డి బుధవారం నాడు అక్కడికి వెళ్లి క్షుణ్ణంగా పరిశీలించారు ఈ వర్షపు నీరు వల్ల గ్రామానికి చెందిన తొంట లక్ష్మి, పసునూరి వెంకట్ రెడ్డి, వరికుప్పల యాదయ్య లెంకల సొంమల్లు ఇళ్ళలకు నీరు చేరాయి. వర్షపు నీరు బయటికి వెళ్లకుండా అక్రమ నిర్మాణాలు ఉంటే వాటిని వెంటనే తొలగించాలని మున్సిపల్ కమీషనర్ సతీష్ కుమార్‌ను



ఆదేశించారు. అదేవిధంగా మోత్కూరు పెద్ద చెరువు కట్ట (మోత్కూరు-రహదారి) కుంగిన ప్రాంతాన్ని ఆర్డీవో సందర్శించి పరిశీలించారు. చెరువు కట్ట పై భారీ వాహనాల రాకపోకలు నిలిపివేయాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంట తహశీల్దార్ పి.జ్యోతి, మున్సిపల్ కమీషనర్ కె.సతీష్ కుమార్,, ఆర్ ఐ సుమన్ ,రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# బృందావన్ కాల్వ నుండి నీరు బజారులోకి

మోత్కూరు, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని బృందావన్ కాల్వ నుండి బుధవారం నీరు బజారులోకి రావడంతో ఈ



దారి నుండి వెళ్లే ప్రజలకు, వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను మున్సిపల్ అధికారులు తక్షణమే పరిష్కరించి, యధావిధిగా రాకపోకలను కొనసాగించే విధంగా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

# బీఆర్ఎస్‌లో భారీ చేరికలు...

**గుండాల, అక్టోబర్ 29(వార్త వేదిక సూర్య):** గుండాల మండలంలోని సుద్దాల గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ బత్తిని రవి కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేసి బీఆర్ఎస్ పార్టీలో చేరిన 18 కుటుంబాలకు చెందిన సుమారు 100 మంది నాయకులు బీఆర్ఎస్ లో చేరారు. గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎండీ. ఖలీల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మందడి



రామకృష్ణారెడ్డి, మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ గడ్డమీది పాండరి, మాజీ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మూగల శ్రీనివాస్,బీఆర్ఎస్ సుద్దాల గ్రామ శాఖ అధ్యక్షుడు కొండపల్లి మొగులాల్ కేసీఆర్ నాయకత్వాన్ని బలోపేతం చేసేందుకు బీఆర్ఎస్ లో చేరుతున్నట్లు తెలిపిన రవి కుమార్ గౌడ్, ఇతర నాయకులు...

# తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలి

**భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 29(వార్త వేదిక సూర్య):** అకాల వర్షాలతో చేతికి వచ్చిన పంట తడిసిందని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బి ఆర్ ఎస్ మండల అధ్యక్షుడు పాటి సుధాకర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో చేతికొచ్చిన పంట నేల పాలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వరి కోసి కుప్పలుగా పెట్టిన రైతుల ఒడ్లు వర్షానికి కొట్టుకపోతున్నాయని చేతి కాడికి వచ్చిన ముద్ద జారినట్లు ఉందని, వర్షాలతో రైతులకు నష్టం చేకూరిందని అన్నారు. పంట నష్టపోయిన రైతులకు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాసులు పోశారని,



కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన నేటికీ వడ్లు కొనుగోలు చేయడం లేదని అన్నారు. పంట నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

# నర్సాపురంలో మహిళపై దాడి కేసులో దోషులకి జైలు శిక్ష

**వలిగొండ, అక్టోబర్ 29(వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలో నర్సాపురం గ్రామంలో 2019 సంవత్సరంలో నమోదైన కేసులో గ్రామానికి చెందిన కావటి మహేష్, కాబట్టి నరేష్, కాబట్టి శివ, ఎనుగుల ఉప్పలయ్య, జక్కుల రామకృష్ణ మరియు కావటి సుదర్శన్ అనే ఆరుగురు నిందితులు మహిళపై దాడి చేసి గాయపరిచిన సంఘటనలపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తు అధికారి పి శివ నాగ ప్రసాద్ ఆధారాలను సేకరించి సాక్షులతో కోర్టులో ఛార్జ్ సీటు సమర్పించారు. శనివారం ఎస్ శిరీష అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు రామన్నపేట వారు నిందితులందరినీ దోషులుగా నిర్ధారించి, ప్రతి ఒక్కరికి ఒక సంవత్సరం శిక్షతోపాటు రూపాయలు 500 జరిమానా విధించారు. ఈ కేసు విచారణలో ఏపిపి వెంకట అవినాష్ సమర్థంగా వాదించారు .కేసు విజయవంతం పూర్తి కావడంతో సహకరించిన సిడిఓ ఏ రామాచారి వలిగొండ పోలీస్ సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## భారీ వర్షాలకు ప్రజలు బయటికి వెళ్ళొద్దు : ఆర్‌డిఓ

**అడ్డగూడూర్,అక్టోబర్ 29(వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూర్ మండలంలోని తలసీల్దార్ కార్యాలయానికి సందర్శించిన ఆర్ డి ఓ ఎం. క్రిష్ణ రెడ్డి మాట్లాడుతూ వర్షాల వలన ఎటువంటి అవంచనీయ సంఘటన లు జరుగ కుండా తగు చర్యలు తీసుకోవాలని, ప్రజలు ఎవ్వరు కూడా అత్యవసర ము అయితే తప్ప బయటకు వెళ్ళవద్దని, మూసి



పరివాహక ప్రాంతాలకు వెళ్ళవద్దని, చెరువులు, కుంటలలో చేపల వేటకు వెళ్ళకూడదని ప్రజలకు అవగాహనా కల్పించాలని, ఇట్టి విషయం పంచాయతీ సెక్రటరీ లు గ్రామము లో టామ్ టామ్ ద్వారా తెలియ జేయాలనీ తెలిపినారు. మరియు రెవిన్యూ సదస్సుల దరఖాస్తులు, సాధాబైనామా బూభారతి దరఖాస్తుల నివేదికలు త్వరిత గతిన పంపగలరని ఆదేశించినారు.

# సిరిపురంలో యువకుడు మిస్సింగ్

**రామన్నపేట, అక్టోబర్ 29(వార్త వేదిక సూర్య):** రామన్నపేట మండల పరిధిలోని సిరిపురం గ్రామానికి చెందిన శివరాత్రి తేజ తన భార్య శివరాత్రి శిరీషను వేధిం పులకు గురి చేశాడు. ఈ విషయంను కుటుంబ సభ్యులకు, కుల పెద్ద మనుషులకు చెప్పడం తో వారు మందలించారు. శివరాత్రి తేజ ఈనెల 25న,శనివారం ఉదయం 05.30 గంటలకు ఎవరికీ చెప్పకుండా ఇంటి నుండి వెళ్లి పోయినాడు. బందువుల దగ్గర చుట్టుపక్కల వెతికినా కూడా ఆచూకీ తెలియలేదు. భార్య శివరాత్రి శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టామని రామన్నపేట ఎస్సై డి నాగరాజు తెలిపారు.



# వర్షం కారణంగా రాకపోకలు బంద్

**అడ్డగూడూర్, అక్టోబర్ 29(వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల పరిధిలోని గోవిందపురం అడ్డగూడూరు వెల్దేవి మానాయకుంట గ్రామల మరియు వెల్దేవి అజింపేట గ్రామాల మధ్య గత రెండు మూడు రోజులుగా కురుస్తున వర్షాల కారణంగా రాకపోకలు బందు..దీనికి కరణం కల్వర్టుల వద్ద హైలెవల్ బ్రిడ్జి లేక నిటి ప్రభావం భారీవర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఎక్కడి వాహనాలు అక్కడే.. నిలిచిపోయిన వాహన దారులు.. వర్షాకాలం సీజన్ వ్యాధులతో బాధపడుతూ ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులకు ఎటు చేరుకోవాలన ఈ రెండు కల్వర్టుల వద్ద హై లెవెల్ బ్రిడ్జి లేక ప్రయాణికులు ఎటు పోలేక గ్రామాలలో వైద్యం అందక ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు అన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని మా గ్రామనికి రాకపోకలకు ఇబ్బంది లేకుండా తక్షణమే హైలెవల్ బ్రిడ్జి పనులు చెప్పటాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



# కుండపోత వర్షానికి డి.రేపాక గ్రామంలో సహాయ చర్యలు అందిస్తున్న పోలీస్ సిబ్బంది

**అడ్డగూడూర్, అక్టోబర్ 29(వార్త వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండల పరిధిలోని డి రేపాక గ్రామంలో వరద తాటికి నీట మునిగిన కొన్ని



ఇండ్లు,వర్ధ బాధితులను ఇండ్ల నుండి బయటికి తీసుకొస్తున్న పోలీసులు ఉదయం నుండి కురుస్తున్న భారీ వర్షం పగలు కావున ఊపిరి పీల్చుకున్నారని బాధితులు తెలిపారు. ఇదే రాత్రి సమయంలో అయితే ప్రమాదం ముంచుకొచ్చేదని అన్నారు.డి రేపాక గ్రామానికి కూత వేటు దూరంలో ఉన్న పోతిరెడ్డి కుంట ఉదయం నుంచి కురిసిన భారీ వర్షానికి నీటి ప్రభావం తట్టుకోలేక వుప్పొంగడంతో..గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఇండ్లల్లోకి ప్రవహిస్తున్న వరద నీరు..దీంతో హుటాహుటిన గ్రామ పంచాయతీ సిబ్బంది స్పందించి రెండు జెసిబిలను తీసుకొని వచ్చి కూడుకుపోయిన కాలువలను మరమ్మతులు చేస్తున్న పరిస్థితి..గ్రామంలో కొన్ని ఇండ్లు నీటిమునగగా వీధులన్నీ జలమయమైపోయాయి.. ముందస్తు చర్యలో భాగంగా అడ్డగూడూరు పోలీసు ఇతర శాఖల సిబ్బందితో కలిసి గ్రామములో ఉండి మొత్తం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపారు.

## మాగంటి సునీతకి మద్దతుగా విస్తృత ప్రచారం

# బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం పిలుపు

**జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బోరబండ డివిజన్, సాయిబాబా నగర్‌లో ప్రచారం చేసిన బిఆర్ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆర్. ఎస్. ప్రవీణ్ కుమార్**

**దేవరకొండ, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):** జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార కార్యక్రమాల భాగంగా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీమతి మాగంటి సునీతకి మద్దతుగా బోరబండ డివిజన్, సాయిబాబా నగర్‌లో ప్రచారం చేసిన నల్లగొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ





మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆర్. ఎస్. ప్రవీణ్ కుమార్ విస్తృత ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత దశాబ్దంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగిందని పేర్కొన్నారు. రైతు బంధు, రైతు బీమా, ఆసరా పెన్షన్‌లు, 24 గంటల ఉచిత విద్యుత్, కాళేశ్వరం ప్రాజెక్టు, కిట్లు పథకాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు వంటి కార్యక్రమాలు ప్రజల జీవితాలను మార్చేశాయని తెలిపారు.

అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు 2 సంవత్సరాలు కావస్తున్నా ఎటువంటి హామీని నెరవేర్చలేకపోయిందని,4 వేల పెన్షన్ ఇవ్వలేకపోయింది,

6 గ్యాస్ సిలిండర్లు ఉచితం అన్న మాటను మరచి పోయింది. గృహలక్ష్మి పథకం ప్రజలకు దూరమైనది, ఇంటింటి వైద్య సేవలు నిలిపివేసింది,బతుకమ్మ చీరలు, గర్భిణులకు ఇచ్చే కిట్స్ నిలిపివేత రైతులకు మద్దతు ధరకే పంట కొనుగోలు జరగడం లేదని విమర్శించారు

ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో పొందిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గుర్తు చేసుకుని మరోసారి బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి మాగంటి సునీత గారిని ఘన విజయంతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు మరియు బోరబండ బూత్ కమిటీ సభ్యులు దేవరకొండ బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు



# బెల్టు షాపులపై పోలీసు దాడులు

**- ఇరవై వేల రూపాయల విలువ గల మద్యం సీజ్**

**- నిర్వాహకులపై కేసు నమోదు**

**చెన్నూరు, అక్టోబర్ 29(వార్త వేదిక సూర్య):** దాబాల పేరుతో నిర్వహిస్తున్న బెల్టు షాపులపై బుధవారం రోజున కోటపల్లిపోలీసులు కొరడా ఝులిపించారు. కోటపల్లి మండలం లక్ష్మీపూర్, రాపన్ పల్లిల్లోని జాతీయ రహదారి సమీపంలో దాబాల పేరున అక్రమంగా బెల్టు దందా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు జోరుగా వినిపించగా ఎస్సై రాజేందర్ తన సిబ్బందితో కలిసి పలు దాబాలపై దాడులు నిర్వహించి 20వేల రూపా యల విలువ గల మధ్యాన్ని సీజ్ చేసి నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్ పేర్కొన్నారు. చట్ట వ్యతిరేకమైన కార్యకలా పాలకుపాల్పడేవారెవరైనా ఉపేక్షించబోమని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాజేందర్ హెచ్చరించారు.



# జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్

**హైద్రాబాద్, అక్టోబర్ 29(వార్త వేదిక సూర్య):** వెంగళరావు నగర్ డివిజన్ లోని యాదగిరినగర్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ ని అధిక మెజారిటీతో గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ఇంటింటి ప్రచారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమంలో బూత్ ఇంచార్జి నాయకులు శ్రీశైలం యాదవ్, స్థానిక నాయకులు



మహేష్, మౌళి, సరిత, రజాక్ మరియు బూత్ కో ఆర్డినేటర్స్ శేఖర్ యాదవ్, శ్రీనివాస్ పాపిరెడ్డి, ఆంజనేయులు, హరికృష్ణ గమరియు ఇతర ముఖ్య కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్ ప్రభావంపై జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో

# జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి టెలికాన్ఫరెన్స్

**నల్లగొండ, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):** మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా కేంద్రం మొదలుకొని గ్రామస్థాయి వరకు అధికారులు, సిబ్బంది అందరూ వారి వారి కార్య స్థానాల్లో ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుధవారం ఆమె మొంథా తుఫాన్ ప్రభావం పై జిల్లా, డివిజన్ స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు ఎవరు సాధ్యమైనంత వరకు ఇళ్లనుండి బయటకు రావద్దని, అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని చెప్పారు. రైతులు పొలం పనుల నిమిత్తం పోలాలకు వెళ్ళవద్దని, అలాగే పంట కోతలు చేయవద్దని, పొలాలకు వెళ్లిన సమయంలో వాన నీటిలో పాముకాటు గురయ్యే అవకాశం ఉందని, అలాగే పిడుగుపాటు, ఇతర ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. వీటన్నిటి నుండి సురక్షితంగా ఉండేందుకు ఇళ్లలో ఉండాలని చెప్పారు.





లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షం వల్ల తడిసి పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లల్లో ఎవరు ఉండ కుండా మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు అలాంటి ఇండ్లను గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేసి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. వర్షాల నేపద్యంలో పాఠశాలలకు, అంగన్వాడీలకు సెలవు ప్రకటించడం జరిగిందని, అయినప్పటికీ కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు,, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉండే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత ఆర్సివోలు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, క్షేత్రస్థాయిలో పర్యటించి ఆయా పాఠశాలల్లో పారిశుధ్య,ఆరోగ్య సమస్యలు, విద్యుత్ ప్రమాదాలు,ఇతర సమస్యలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు పశువులను పొలాల్లోకి వదల వద్దని, అలా వెళ్లడం వల్ల పిడుగుపాటుకు పశువులు చనిపోయే ఆస్కారం ఉందని తెలిపారు. వర్షాలనేపద్యంలో ప్రజలుప్రత్యేకించి యువత వాగులు, వంకలు, నదుల వద్దకు ఈత కొట్టేందుకు,బట్టలు ఉతికేందుకు, చేపలు పట్టేందుకు ఎవరు వెళ్ళవద్దని, అలాగే లోతట్టు కాజ్ వేలు, పొంగి ప్రవహించే బ్రిడ్జిలు, వాగులు, వంకలు దాటే ప్రయత్నం చేయవద్దని ఆదేశించారు. వర్షాలను దృష్టిలో ఉంచుకొని దాన్యం, పత్తి కోతలు చేయవద్దని రైతులను కోరారు. అలాగే కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యం ,పత్తి పంటలు తడవకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఇందులో భాగంగా టార్పాలిన్లు కప్పి ఉంచాలని అన్నారు. ఎక్కడైనా రహదారులు దెబ్బ తిన్న ,కోతకు గురైన, తెగిపోయిన, గుంతలు పడిన వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టేలా పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బి శాఖలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యుత్ అధికారులు అందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, ఎక్కడైనా వంగిపోయిన విద్యుత్ స్తంభాలు, వేలాడే వైర్లు ఉంటే సరిచేయాలని, ఎవరు విద్యుత్ ప్రమాదాలకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. దేవరకొండ డివిజన్లో 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనందున ఈ ప్రాంతంలోని మారుమూల, గిరిజన తండాల ప్రజలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఇక్కడి క్షేత్రస్థాయి సిబ్బంది క్షేత్రస్థాయిలోనే అందుబాటులో ఉండి ప్రజలకు ఇబ్బందులు కలగ కుండా చూడాలని తెలిపారు. మొంథ తుఫాన్ కారణంగా భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లో 24 గంటలు పని చేసే విధంగా సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆయా శాఖల అధికారులను ఆమె ఆదేశించారు. ప్రజలు వర్షానికి సంబంధించిన సమాచారాన్ని కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ ఫోన్ నెంబర్ 18004251442 కు తెలియజేయాలని ఆమె కోరారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, భారీ వర్షాల సందర్భంగా ఆయా శాఖల అధికారులు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు.




## భారీ వర్షాలు కురుస్తుండటంతో
# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- ఎస్సై సంజీవ రెడ్డి**



**గట్టుప్పల,అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):** మొంథా తుఫాన్ భారీ వర్షాల కారణంగా మండలం లోని ఉదయం నుండి వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు అవసరమైతే తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవ్వరూ బయటకు రాకూడదని ఎస్ఐ సంజీవ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరే అవకాశం ఉన్నందున చిన్నారులను, వృద్ధులను, ఒంటరిగా ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు పంపించవద్దు అని ఆయన సూచించారు. మట్టి గోడల పాత ఇండ్ల నివాసులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ స్తంభాల దగ్గరికి పిల్లలు వెళ్లకూడదని వర్షాలతో చెరువులు కుంటలు నిండి రోడ్ల పై వాగులు ప్రవహించే సమయంలో ప్రజలు వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.

## చింతకుంట్ల గ్రామాన్ని పరిశీలించిన
# డాక్టర్ దుదిపాలవేణుధర్ రెడ్డి

**దేవరకొండ, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):** కొండమల్లెపల్లి మండల పరిధిలో చింతకుంట్ల గ్రామంలో గల మంగళవారం రాత్రి కురిసేటువంటి భారీ వర్షాల కారణంగా కొండమల్లేపల్లి మండలంలోని చింతకుంట్ల గ్రామంలో నల్లకుంట తెగిపోవడంతో ఆ గ్రామస్తులను పరామర్శిస్తున్న పిఎసిఎస్ చైర్మన్ కొండమల్లేపల్లి





డాక్టర్ దుదిపాల వేణుధర్ రెడ్డి ఎస్సీ కాలనీలో పల్లూ ఇండ్లలో నీళ్లు చేరడం తో వారి ఇంటికి వెళ్లి పరామర్శించి అధికారులను వారి యొక్క వసతులను షెల్టర్ మరియు భోజనం ఏర్పాటు చెయ్యాలి కోరిన పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి అదే విధంగా కుంట తెగిన విషయాలను సంబంధింత అధికారులు ను కుంటను పరిశీలించి మరమ్మత కొరకు ఇరిగేషన్ అధికారులను కోరిన పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి అధికారులను కోరినారు.

## పంట నష్టపోయిన రైతులకు
# నష్టపరిహారం చెల్లించాలి

**-రాష్ట్ర నాయకులు అనంత రాజుగౌడ్ డిమాండ్**

**మర్రిగూడ, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):** మెంతా తుపాన్ ప్రభావంతో గత కొన్ని రోజులుగా కురుస్తున్నా భారీ వర్షాల వల్ల మండల వ్యాప్తంగా వరి, పత్తి పంటలు పాడైపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు వెంటనే పంటనష్టపోయిన రైతులకు నష్ట పరిహారన్ని చెల్లించి వారిని ఆదుకోవాలని మర్రిగూడ మాజీ ఎంపీపీ బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు అనంత రాజుగౌడ్ కోరారు. బుధవారం రోజున అతను స్థానికంగా మాట్లాడుతూ చెమటోడ్చి పండించిన పంట చేతుకోస్తుందనుకునే సమయంలో ఇలా అర్ధతరంగా వర్షాల బారిన పడి పంటలు పూర్తిగా పాడైపోవడంతో రైతులు ఎంచేయాలో దిక్కుతోచని పరిస్థితులో ఉన్నారని అన్నారు. రైతులది పంట పండితే గాని డొక్కాడని పరిస్థితులు కావున రైతుల యందు దయఉంచి ఇరు ప్రభుత్వాలు సంబంధిత అధికారులతో మండల వ్యాప్తంగా నష్ట పోయిన పంటలను అంచనావేసి రైతులకు నష్టపరిహారంను చెల్లించాలని పేర్కొన్నారు.




## మొంథా తుఫాను...
## జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్**

**నల్లగొండ, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):** మొంథా తుఫాను కారణంగా జిల్లాలో ఎడతెరుపు లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. అత్యవస రమైతే తప్ప ప్రజలు రోడ్ల పైకి అనవసరంగా రాకూడదని అన్నారు. దేవరకొండ కొమ్మెపల్లి గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో వరదనీటిలో చిక్కుకున్న విద్యార్థులను తక్షణమే స్పందించి సిబ్బందితో కలిసి జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సురక్షిత ప్రాంతానికి తరలించారు.



# మొంథా తుఫాన్ బాధితులను గుర్తించి ఆదుకోవాలి

**వి.కోటేశ్వరరావు ఏ.ఐ.కె.ఎం.ఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు.**

**నల్లగొండ, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):** గత మూడు రోజులుగా మొంథా తుఫాన్‌తో భారీగా కురుస్తున్న వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా (వరి,పత్తి, మొక్కజొన్న, బొప్పాయి, నిమ్మ,)తదితర రైతుల పంటలతో పాటు సాధారణ, పేద ప్రజలకు ఇండ్లు, ఆస్తి నష్టం జరిగింది, ప్రభుత్వం వెంటనే నష్టపోయిన పంటలను, జరిగిన నష్టాన్ని గుర్తించి తగిన నష్టపరిహారం ఇవ్వాలని అఖిల భారత రైతు -కూలీ సంఘం (ఏ.ఐ.కె.ఎం.ఎస్) తెలంగాణ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వి. కోటేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని శ్రామిక భవన్ లో జిల్లా ఏ.ఐ.కె.ఎం.ఎస్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వి. కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ లో వరి ఉత్పత్తిలో జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. పత్తి ఉత్పత్తి లో ఆదిలాబాద్ తరువాత మనజిల్లా రెండో స్థానంలో ఉంది. ఉద్యాన వన ఉత్పత్తి లో ప్రథమ స్థానంలో ఉంది. పత్తి, వరి పంటలు మార్కెట్ కు వస్తున్న తరుణంలోనే తుఫాన్ చాలా నష్టం కలిగించింది. గత యాసంగిలో కేవలం నాలుగు శాంతం మాత్రమే వరి కొనుగోలు చేశారు. రైతులు 845కోట్లు బోనస్ ను కోల్పోయారు. ఇప్పుడు ఈ




తుఫాన్ ప్రభావం తోని అన్ని రకాల పంటలు తడిసి పోవటం వలన ప్రభుత్వమే కనీసం మద్దతు ధర తో కొనుగోలు చేయాలి. ప్రకృతి వైపరిత్యంతో రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు తీవ్రంగా నష్టపోయాయని, ఐకేపీ సెంటర్స్ ల్లో పోసిన దాన్యం తడిసి మొలకలేత్తాయని అన్నారు. ధాన్యం కొనుగోలును వేగవంతం చేసి మద్దతు ధర చెల్లించాలని అన్నారు. మొంథా తుఫాన్ గాలి వానతో చేతికోచ్చిన పంటలు నేల మట్టం అయ్యాయని పేర్కొన్నారు. నిరుపేదల ఇండ్లు ధ్వంసం అయ్యాయని, లోతట్టు గ్రామాలు నీట మునిగాయని తెలిపారు. అధికారులు నిర్వాసితులను గుర్తించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మొంథా తుఫాన్ తీవ్రంగా ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని, కరెంట్ ట్రాన్సపార్మర్, స్తంబాల వద్దకు వెళ్ళవద్దని, శిదిలావస్థకు చేరిన భవనాలు, మట్టి గోడలకు దూరంగా ఉండాలని తెలిపారు. అధికారులు వైద్య సేవలతో పాటు 24 గంటలు అప్రమత్తతతో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏ.ఐ.కె.ఎం.ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. డేవిడ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబటి చిరంజీవి, జిల్లా నాయకులు గజ్జి రవి, కల్లూరి అయోధ్య, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశ హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమాలు చేద్దాం..

**నల్లగొండ,అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):** ఆశా హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమాలు చేసి సాధించుకుం దామని, ఉద్యమాల ద్వారానే మన సమస్యలు పరిష్కారం అవుతాయని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి తవిటి వెంకటమ్మ, రాష్ట్ర కమిటీ సభ్యురాలు దేగల మహేశ్వరి తెలిపారు. అక్టోబర్ 26,27 తేదీలలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో జరిగిన ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర 4 వ మహాసభలో నల్గొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా పనిచేస్తున్న దేగల మహేశ్వరి, తవిటి వెంకటమ్మ కు రాష్ట్ర కమిటీ లో చోటు లభించింది.

ఈ సందర్భంగా బుధవారం దొడ్డి కొమురయ్య భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఆశ వర్కర్ల అందరూ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాటం చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం ఇండియన్ లేబర్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించి కార్మికుల హక్కుల సాధన కోసం కృషి చేస్తామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆశ వర్కర్లతో వెట్టిచాకిరి చేయిస్తుందని 45వ లేబర్ కమిషన్ సమావేశాల్లో






నిర్వహించిన సమస్యలను పరిష్కరించకుండ 11 సంవత్సరాలనుండి ఐ ఎల్ సి సమావేశాల్లో ఏర్పాటు చేయడం లేదని మండిపడ్డారు. 2018లో సుప్రీంకోర్టు కార్మికులందరికీ కనీస వేతనం 26000 నిర్ణయించాలని గుర్తు చేశారు. ఆశ కార్మికులు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఆశాలను ఉద్యోగుల గుర్తించాలని అన్నారు. ఆశల పోరాటంపై ఆంక్షలు విధించడం సిగ్గుచేటు అని చేశారు. అనేక రకాల కార్మికుల పోరాటాలు చేస్తుంటే ధర్నాలు వద్దు దరఖాస్తులు ఇవ్వండి సరిపోతుందని చెప్పడం సరికాదని అన్నారు సమస్యలు పరిష్కరించడంలో సిఐటియు ముందుందని అన్ని అన్నారు.

ఆశా వర్కర్ల పోరాటం సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన అనేక హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆశాలు తక్షణమే సమరశీలమైన పోరాటాల ద్వారానే హక్కులు సాధించుకుంటామని తెలిపారు ఆశ వర్కర్లను చీల గొట్టడానికి అనేక సంఘాలు ప్రభుత్వాలు ఎన్నో కుట్రలు చేసినా సిఐటియు అండతో తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ దిన దినా అభివృద్ధి చెందుతుందని గుర్తు చేశారు. రానున్న కాలమంతా పోరాటాల కాలమని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించడానికి అశా కార్యకర్తలు అందరూ సిద్ధం కావాలని వారు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు.

# గొర్రెల దొంగలను పట్టుకొని కొమరయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

**జిఎంపిఎస్ జిల్లా గౌరవ అధ్యక్షులు బండారు నరసింహ**

**చౌటుప్పల్, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):** యాదాద్రి భువనగిరి జిల్లాలోని వనపర్తి గ్రామంలో ఇటీవల 100 గొర్లు దొంగిలించి తీసుకువెళ్లారని వారిని వెంటనే పోలీసులు పట్టుకొని కొమరయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని జిల్లా జి.ఎం.పి.ఎస్ గౌరవ అధ్యక్షులు బండారు నరసింహ అన్నారు. గురువారం చౌటుప్పల మండల కేంద్రంలో గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం జిఎంపిఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం యాదాద్రి భువనగిరి జిల్లా గౌరవ అధ్యక్షులు బండారు నరసింహ మాట్లాడుతూ ఇటీవల కాలంలో గొర్రెల దొంగతనాలు ఎక్కువ అయ్యాయని అన్నారు. మంగళవారం ఇటీవల భువనగిరి మండలంలోని వడపర్తి గ్రామానికి చెందిన మేద బోయిన కొమరయ్య గొర్రెల మందలో దొంగలు పడి 100 గొర్రెలను ఎత్తుకెళ్లారని అన్నారు. తక్షణం పోలీస్



అధికారులు స్పందించి గొర్రెల దొంగలను పట్టుకొని శిక్షించాలని అదేవిధంగా కొమరయ్య కుటుంబాని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గత కొంతకాలంగా యాదాద్రి భువనగిరి జిల్లాలో భువనగిరి బీబీనగర్ మండలలో విపరీతమైన గొర్రెల దొంగతనాలు జరుగుతున్నాయని గతంలో అనేక సందర్భాల్లో పోలీస్ అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడం జరిగిందని తాత్కాలికంగా కొంత మందిని పట్టుకొని వదిలేస్తున్నారని తక్షణమే దొంగతనం చేసిన వారిని కఠినంగా శిక్షించి మళ్లీ దొంగతనాలు జరగకుండా చూడాలని అదేవిధంగా పోలీసు యంత్రాంగం ప్రత్యేకమైన మొబైల్ ను ఏర్పాటు చేసి దొంగతనాలు జరగకుండా చూడాలని కోరారు.

ఈ కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం మండల కార్యదర్శి కొండే శ్రీశైలం అధ్యక్షులు భీమనగొని బాలరాజ్ జిల్లా కమిటీ సభ్యులు గుణముని ఐలయ్య గజ్జి పాండు గడగోటి జంగయ్య అరిగే బీరయ్య శంకరయ్య యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొండమల్లేపల్లి ఎస్ఐ అజ్మీరా రమేష్ ధైర్య సాహసాలకు సెల్యూట్

**దేవరకొండ, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):** పోలీసులు అంటేనే కొంతమంది అదో విధంగా భావిస్తారు కానీ శాంతి భద్రతల పర్యవేక్షణలో బిజీ జీవితాలను గడుపుతూ సమాజంలో పోలీసులు పాత్ర చాలా ముఖ్యమైనది ఒకవైపు తమ కుటుంబాన్ని చూసుకుంటూ,



ప్రజలకు రక్షణ కల్పిస్తున్నారు. అక్రమాలపై ఉక్కుపాదం మోపుతూ రాత్రి పగలు అనక సమాజ శ్రేయస్సు కోసం తమ ప్రాణాలు పణంగా పెట్టి శాంతి భద్రతల పరిరక్షణ కొరకు తమ జీవితాలను త్యాగం చేస్తున్నారు. ఖాకీలంటే కఠినమైన మనసే కాదు, మంచి మనస్సు కూడా కలిగిన వారమని నిరూపించిన కొండమల్లేపల్లి ఎస్ఐ అజ్మీర రమేష్ కొండమల్లేపల్లి మండలంలో భారీ వర్షాలు సైతం లెక్కచేయ కుండా ప్రజల శ్రేయస్సు కోసం గత రెండు రోజుల నుండి గ్రామ పంచాయతీ, రెవెన్యూ, విద్యుత్, నీటిపారుదల శాఖ అధికారులతో పాటు పోలీస్ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజల సహకారం అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కొండమల్లేపల్లి పట్టణంతో పాటు, గౌరుకుంట తండా, బాపూజీ నగర్, ఉప్పవాగు, దోనియాల, చిన్న అడిశర్లపల్లి అంబేద్కర్ కాలనీ తదితర గ్రామాలలో భారీ వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ప్రజలకు మూగజీవులకు ఇబ్బందులు తలెత్తకుండా తన సాహసోపేత నిర్ణయాలతో ప్రజల





ప్రాణాలకు, ఆస్తులకు ఇబ్బందులు రాకుండా భారీ వర్షాలతో వచ్చిన నీళ్లను తాను తడుస్తూ దగ్గర ఉండి తగు సూచనలు చేస్తూ భారీ వర్షాలతో వచ్చిన నీళ్లను దోనియాల చెరువులోకి మళ్ళించి భారీ ప్రమాదం నుండి ప్రజలను కాపాడారు. గత పది ఏళ్ల తర్వాత నిండిన నల్లకుంట నిండి ప్రమాద స్థాయికి చేరుకుందని గ్రహించి అకస్మాత్తుగా నల్లకుంట తెగితే చాలా ప్రాణ ఆస్తి నష్టం జరుగుతుందని భావించిన ఎస్ఐ అజ్మీర రమేష్ గారు రంగంలోకి దిగి నల్లకుంట నీళ్లను అలుగుద్వారా బయటికి పంపించారు. అదేవిధంగా తాత్కాలికంగా బైపాస్ నుండి కుంటలోకి నీళ్లు రాకుండా బైపాస్ ద్వారా చెరువులోకి వెళ్లేటట్టు మార్గం సుగమమం చేశారు. దీంతో చుట్టుపక్కల ప్రజలు ప్రాణాలు ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ఐ



అజ్మీర రమేష్ విరోచత ధైర్యసహసాలకు ప్రజలు ముక్తకంఠంతో అభినందిస్తూ ఎస్ఐ గారి సాహసోపేత నిర్ణయాలకు అభినందిస్తున్నారు. ఇలాంటి ముందుచూపు, ప్రజల భద్రతపై ప్రత్యేక చొరవ చూపిన రియల్ హీరోగా ఎస్ఐ అజ్మీరా రమేష్‌ని ప్రజలు కీర్తిస్తున్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నల్లగొండ, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):** భారీ వర్షాల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. దేవరకొండ డివిజన్లో భారీ వర్షాలు ఎక్కువగా ఉండడం, డివిజన్ మొత్తంలో 12 సెంటీమీటర్ల వర్షం కురవడం వల్ల ఇబ్బందులు తలెత్తకుండా బుధవారం ఆమె దేవరకొండ డివిజన్లో పర్యటించారు. కొండమల్లేపల్లి మండలం గిరిజానగర్ తండా వద్ద పై నుండి వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తూ ప్రధాన రహదారిపై నిలిచిపోవడం వల్ల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని గమనించి తక్షణమే వర్షపు నీటిని మళ్లించి ప్రజలు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వర్షాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, కాజ్ వేలు, రహదారులు, బ్రిడ్జిలపై ప్రయాణించవద్దని



సూచించారు. అలాగే వర్షం వల్ల తడిసి పడిపోయేందుకు అవకాశం ఉన్న ఇళ్లలో ఉండవద్దని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి, తహసిల్దార్, ఎంపీడీవో తదితరులు ఉన్నారు.



www.vaarthavedhikasurya.com
వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

# కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే ఎంఐఎంకు వేసినట్లే

- పోలీస్ స్టేషన్లలో బైండోవర్ అయ్యే కాంగ్రెస్ అభ్యర్థి కావాలా?
- ప్రజల మధ్య తిరిగే బిజెపి అభ్యర్థి కావాలా?
- పార్టీ పదాధికారుల సమావేశంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు

**హైదరాబాద్,అక్టోబర్ 29 (వార్త వేదిక సూర్య):** బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన ఈ రోజు పార్టీ పదాధికారుల సమావేశంలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో బిజెపి శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు గరికపాటి మోహన్ రావు , తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాబోయే కాలంలో పార్టీ బలోపేతం, విస్తరణకు చేపట్టాల్సిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విస్తృత స్థాయిలో ప్రచారం నిర్వహించి పార్టీ విజయం కోసం కృషి చేయాలని పార్టీ రథసారథి రాంచందర్ రావు పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాలను గడపగడపకు చేరేలా ప్రచారం ముమ్మరం చేయాలని సూచించారు.

గత బీఆర్ఎస్ పాలనలో చోటుచేసుకున్న అవినీతి, అరాచకాలను, అలాగే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన తప్పుడు హామీలు, అమలు కాని "6 గ్యారంటీల"ను ప్రజల ముందు బహిర్గతం చేయాలని పార్టీ నేతలకు సూచించారు.

తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టిని బలోపేతం చేసి విస్తరించడం ఇక్కడి నాయకులు, కార్యకర్తలపై జాతీయ పార్టీ




బలమైన నమ్మకాన్ని ఉంచింది. బిజెపి జాతీయ పార్టీ సూచనల మేరకు ప్రతిఒక్కరు సమన్వయంతో పార్టీని ముందుగా తీసుకుపోవాల్సిన అవసరం ఉంది.

ప్రజలకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పథకాల ప్రయోజనాల గురించి క్షేత్రస్థాయిలో తెలియజేయాలి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి అనుకూల వాతావరణం ఉంది. బిజెపి గెలుస్తుందనే ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తం చేస్తున్నాం. తెలంగాణలో బీఆర్ఎస్‌ను ప్రజలు ఇప్పటికే మర్చిపోయారు.

వచ్చే నెల 11వ తేదీన జూబ్లీహిల్స్‌లో జరగబోయే ఉపఎన్నిక సందర్భంగా, బీఆర్ఎస్- కాంగ్రెస్ పార్టీలు మరోసారి ప్రజలను మోసం చేయడానికి సిద్ధమవుతున్నాయి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ ఎంఐఎం-బిజెపి మధ్యే జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే , అదే ఎంఐఎంకు వేసినట్లే. 100 రోజుల్లో 6 గ్యారంటీలు" అని అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ఇప్పుడు చేతులెత్తేసింది..

కాంగ్రెస్ పార్టీకి తగిన అభ్యర్థులు లేరని, గతంలో ఎంఐఎం నుంచి పోటీచేసిన అభ్యర్థిని ఇప్పుడు కాంగ్రెస్ నుంచి పోటీ చేయిస్తోంది. ప్రజలు ఆలోచించుకోవాల్సిన విషయం ఏంటంటే... పోలీస్ స్టేషన్లలో బైండోవర్ అయ్యే కాంగ్రెస్ అభ్యర్థి కావాలా? లేక ప్రజల మధ్య తిరిగే, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి కోసం పనిచేసే బిజెపి అభ్యర్థి కావాలా? ఇవన్నింటిని దృష్టిలో పెట్టుకొని ప్రజలే తగిన నిర్ణయం తీసుకుంటారు. రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరు పార్టీని మరింత బలోపేతం చేసేలా, పార్టీ విస్తరణ కోసం సమన్వయంతో కృషి చేయాలి.

# సీఎంను కట్టేస్తేనే మహబూబ్ నగర్‌కు మంచి జరుగుతుందా?

- బీఆర్ఎస్‌తో సంబంధం లేదు. ఆ పార్టీ గురించి అడగకండి
- కవిత ఇండిపెండెంట్.. నా వెనుక ఎవరు లేరు
- దగాపడ్డ ఉద్యమకారుల్లో నేను కూడా బాధితురాలినే
- గతంలో కన్నా కూడా ఇప్పుడే ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది
- నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో రేవంత్ రెడ్డి అన్యాయం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

**మహబూబ్ నగర్,అక్టోబర్ 29 (వార్త వేదిక సూర్య):** కవిత ఇండిపెండెంట్. నా వెనుక ఎవరు లేరు. నా ముందు ప్రజలు ఉన్నారు. కొత్తగా వచ్చిన వారిపై ఆరోపణలు, అనుమానాలు, అవమానాలు ఉంటాయి. కాంగ్రెస్ వాళ్లు నేను బీజేపీ బీ టీమ్ అని, బీజేపీ వాళ్లు కాంగ్రెస్ బీ టీమ్ అని అంటారు. బీఆర్ఎస్ వాళ్లు ఏదేదో ఆరోపణలు చేస్తూనే ఉన్నారు. అయితే నా నడక ద్వారా నా స్టాండ్ ఏంటో ప్రజలకు అర్థమవుతుంది. అందుకు కొంత సమయం పడుతుంది.

నీళ్లు, నిధులు, నియామకాలు విషయంలో రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రెండున్నర లక్షల కోట్లు అప్పు తెచ్చారు. అయినా ఆరు గ్యారంటీలు అమలు చేయటం లేదు. జాగృతి తరఫున షాడో కేబినెట్ వేస్తాం. కేబినెట్ లో ఉన్న వారిని నీడలా వెంటాడుతాం.

దగాపడ్డ ఉద్యమకారుల్లో నేను కూడా బాధితురాలినే. ఆడబిడ్డలు అని చెప్పరు. గుంభనంగా అభివృద్ధి జరగాలని ఎన్నో విషయాలను బయటకు చెప్పలేదు. గతంలో కన్నా కూడా ఇప్పుడే ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. గతంలో కొన్ని పనులు చేయించలేకపోయాను. అమరవీరులందరికీ న్యాయం జరగలేదు. అందుకే అమరవీరుల కుటుంబాలకు కోటి రూపాయలు ఇప్పించాలని పోరాటం చేస్తున్నా.

బతుకమ్మ ఎత్తుకొని మొత్తం ప్రపంచానికి పరిచయం చేశాను. అలాంటి కమిట్ మెంట్ తో పనిచేస్తాను. నా రాజీనామా యాక్సెప్ట్ చేయండి నేను అడుగుతూనే ఉన్నా. కాంగ్రెస్ వాళ్లకు ఏం రాజకీయం ఉందో? నా రాజీనామా యాక్సెప్ట్ చేస్తే, పార్టీ మారిన



ఎమ్మెల్యేల రాజీనామాలు యాక్సెప్ట్ చేయాల్సి ఉంటుందేమో? నేను లోకల్ బాడీ ఎమ్మెల్సీ ని. ఇప్పుడు లోకల్ బాడీ ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో కూడా తెలియదు. నాకు బీఆర్ఎస్ తో సంబంధం లేదు. బీఆర్ఎస్ ద్వారా వచ్చిన రాజీనామా యాక్సెప్ట్ చేయమని కోరుతున్నా.

అది సామాజిక తెలంగాణ ద్వారానే సాధ్యమవుతుంది. అందుకోసమే నా ప్రయత్నం. ఐతే ఈ 10 ఏళ్లు ఏం చేశారన్న ప్రశ్న కూడా వస్తుంది. అందరికీ ఆహారం, నీళ్లు, పెన్షన్లు ఇలా కేసీఆర్ కొంత మంచి చేశారు. గతంలో రేవంత్ రెడ్డి ఇక్కడకు ప్రచారానికి వచ్చినప్పుడు , అప్పటి మంత్రి లక్ష్మారెడ్డిని కట్టేస్తేనే కరెంట్ వస్తుందని అన్నారు. మరి ఇప్పుడు సీఎం ను కట్టేస్తేనే మహబూబ్ నగర్ కు మంచి జరుగుతుందా?

రామారెడ్డిలోని గురుకులంలో ఒక అమ్మాయి ఆత్మహత్య చేసుకుంటే కనీసం పట్టించుకోవటం లేదు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన గురుకులాలు, హాస్పిటల్స్ ను కూడా ఈ ప్రభుత్వం మెయింటెన్ చేయలేకపోతోంది. బీసీలకు 42 శాతం వాటా రావద్దా? అగ్ర వర్ణాల్లోనూ రాజకీయంగా ప్రాతినిధ్యం లేని వైశ్యులు ఉన్నారు. ముస్లింలు, లంబాడాలు లేని మొదటి కేబినెట్ ఇది.

ఇప్పటికీ మహబూబ్ నగర్ లో మూడు రోజులకొకసారి నీళ్లు వస్తాయా? అది బీఆర్ఎస్ తప్పా, కేసీఆర్ తప్పా అనేది ఇక్కడ చర్చ కాదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ తప్పులను సవరించండి. ఇక్కడి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ పార్టీయో, బీజేపీయో తెలియటం లేదు.

నారాయణ పేట్- కొడంగల్ ప్రాజెక్ట్ కూడా కట్టుకోండి. కానీ 80 శాతం పనులు పూర్తైన ప్రాజెక్ట్ ను పూర్తి చేయండి. లేదంటే ఏపీ ప్రభుత్వం మన నీళ్లను తీసుకెళ్తుంది. ఇప్పటికే కృష్ణా బేసిన్ నీళ్లను తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. గోదావరి నీళ్ల కోసం బనకచర్ల కూడా కట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆల్మట్టి ఎత్తు పెంచితే ప్రయత్నం కూడా జరుగుతుంది. అదే జరిగితే కృష్ణా ప్రాజెక్ట్ ల కాల్వల్లో క్రికెట్ ఆడుకోవాల్సిందే. చుక్క నీరు రాదని మహబూబ్ నగర్ ప్రజలకు చెబుతున్నా. దీన్ని ఆపే ప్రయత్నం ముఖ్యమంత్రి గారు చేయాలి.

దళితుడిని సీఎం చేస్తానని కేసీఆర్ అన్నారు. కానీ 2014 లోనే కేసీఆర్ సీఎం అభ్యర్థి అని చెప్పి ఎన్నికలకు వెళ్లారు. అయినా బీఆర్ఎస్ తో నాకు సంబంధం లేదు. ఆ పార్టీ గురించి అడగకండి. ఉమ్మడి రాష్ట్రంలోనే అసెంబ్లీ లో అంబేద్కర్ విగ్రహం, బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగా చేసుకున్నాం. రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో లేరు. అందుకే ఆయనకు తెలంగాణ తల్లి గురించి తెలియదు. మేము పాత తెలంగాణ తల్లినే గౌరవించుకుంటాం.

## భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి : కేతావత్ భిల్యా నాయక్

**దేవరకొండ, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):** రాష్ట్ర వ్యాప్తంగా బారి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అవసరం అయితే తప్ప బయటికి రావద్దని దూర ప్రయాణాలు చేయకూడదు కరెంట్ స్తంభాలు లను ఎట్టిపరిస్థితుల్లోనూ ముట్టుకో రాదని డ్రైనేజీ,నాలాలతో జాగ్రత్తగా ఉండాలని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కేతావత్ భిల్యా నాయక్ అన్నారు



## భారీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎస్సై సంజీవ రెడ్డి

**గట్టుప్పల, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):** మొంథా తుఫాన్ భారీ వర్షాల కారణంగా మండలం లోని ఉదయం నుండి వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు అవసరమైతే తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవ్వరూ బయటకు రాకూడదని ఎస్ఐ సంజీవ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.వర్షాల ప్రభావంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరే అవకాశం ఉన్నందున చిన్నారులను,వృద్ధులను, ఒంటరిగా ఎట్టి పరిస్థితుల్లోనూ బయటకు పంపించవద్దు అని ఆయన సూచించారు. మట్టి గోడల పాత ఇండ్ల నివాసులు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ స్తంభాల దగ్గరికి పిల్లలు వెళ్లకూడదని వర్షాలతో చెరువులు కుంటలు నిండి రోడ్ల పై వాగులు ప్రవహించే సమయంలో ప్రజలు వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.




## డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన శివధర్ రెడ్డికి ఎం.వి. చారి సేవా ఫౌండేషన్ తరపున సన్మాన పత్రం అందజేత

**చౌటుప్పల్, అక్టోబర్ 29 (వార్తా వేదిక సూర్య):** తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా శివధర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో ఎం.వి. చారి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంవి చారి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా, ఫౌండేషన్ తరపున డీజీపీ



శివధర్ రెడ్డి సన్మాన పత్రం అందజేసి, ఆయన ప్రజాసేవా దృక్పథం మరియు నాయకత్వ నైపుణ్యానికి వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు మాట్లాడుతూ, తెలంగాణ పోలీసు వ్యవస్థలో సాంకేతికత, పారదర్శకత, ప్రజా సేవాభావం పెంపొందించడంలో శివధర్ రెడ్డి మరింత ప్రగతి సాధిస్తారని విశ్వసిస్తున్నాం," అని తెలిపారు. ఆయన వెంట గ్యార కృష్ణ, రాజుల ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.





# పెద్ది బుచ్చిబాబుకు గురువు సలహాలు

ఎంత పెద్ద సినిమా నిర్మించినా ప్రేక్షకులను అలరించాలన్నదే పట్టుదల. ఏ గురువు అయినా తన శిష్యుడు ఎదగాలనే చూస్తాడు. అలాంటి గురువుల్లో సుకుమార్ మొట్ట మొదట వరుసలో ఉంటాడు. ఇప్పటివరకు ఇండస్ట్రీలో సుకుమార్ శిష్యులే ఎక్కువమంది ఉన్నారు. సుకుమార్ సైతం వారంతా ఎదగాలని కోరుకుంటారు. ఇప్పుడు పెద్ది విషయంలో కూడా అదే చేస్తున్నాడు. డైరెక్టర్ సుకుమార్ వద్ద అసోసియేట్ గా పనిచేసిన బుచ్చి బాబు సానా ఉప్పెన సినిమాతో దర్శకునిగా పరిచయం అయ్యారు. ఆ సినిమాను మైత్రీ మూవీ మేకర్స్ తో కలసి సుకుమార్ రైటింగ్స్ కూడా తెరకెక్కించింది. ఆ చిత్రం ఘనవిజయం సాధించింది. ప్రస్తుతం అదే బుచ్చిబాబు సానా డైరెక్షన్ లోనే రామ్ చరణ్ హీరోగా పెద్ది తెరకెక్కుతోంది. ఈ సినిమాతోనూ సుకుమార్ కు సంబంధం ఉంది. మైత్రీ మూవీమేకర్స్ తో కలసి పెద్ది చిత్రాన్ని సుకుమార్ పంపిణీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో పెద్ది కోసం సుక్కు ఎంతో శ్రద్ధ వహిస్తున్నారని సమాచారం. పెద్ది పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ ను కూడా సుకుమార్ దగ్గరుండి చూసుకుంటూ ఉండడం విశేషంగా మారింది. సుకుమార్ తన శిష్యుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న పెద్ది సినిమాకు సూచనలు, సలహాలు ఇవ్వడంతో పాటు పోస్ట్ ప్రొడక్షన్ లోనూ పాలుపంచుకోవడం విశేషంగా మారింది. బుచ్చిబాబు తొలి సినిమా ఉప్పెన కు నిర్మాణ భాగస్వామిగానే ఉన్న సుకుమార్ ఈ సారి పెద్ది కి మేకింగ్ లోనూ చేయిపెట్టడానికి కారణం ఉంది. ఎందుకంటే ఈ సినిమాలో రామ్ చరణ్ హీరో... పైగా పెద్ది సినిమా వచ్చే యేడాది రామ్ చరణ్ బర్త్ డే కానుకగా మార్చి 27న రానుంది. చెర్రీ బర్త్ డేకు వస్తోన్న పెద్ది ఫ్యాన్స్ ను విశేషంగా ఆకట్టుకోవాలనే ఉద్దేశంతోనే సుకుమార్ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ లోనూ పాలుపంచుకుంటున్నారని యూనిట్ మాట. పెద్ది సినిమాకు ఎ.ఆర్.రహమాన్ సంగీతం సమకూరుస్తున్నారు. వృద్ధి సినిమాస్' బ్యానర్ పై 'పెద్ది' చిత్రాన్ని వెంకట సతీశ్ కిలారు, ఇషాన్ సక్సేనా నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ నాయికగా నటిస్తోన్న ఈ మూవీపై ఫ్యాన్స్ లో భారీ అంచనాలు నెలకొన్నాయి. అందువల్ల డైరెక్టర్ గా బుచ్చిబాబు సానాకు పెద్ది మంచి పేరు తీసుకు రావాలనే సుకుమార్ ఆశించి మరీ ఈ సినిమా మేకింగ్ లో ఇన్వాల్వ్ అయినట్టు సమాచారం..

రవితేజ నటించిన మాస్ జాతర సినిమాలో నటుడు రాజేంద్ర ప్రసాద్ కీలక పాత్ర పోషించారు. అయితే ఆ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ కార్యక్రమంలో సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ తాజా వ్యాఖ్యలు ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. రవితేజ హీరోగా నటిస్తున్న 'మాస్ జాతర' సినిమా ప్రమోషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో అన్ని మసాలాలు సరిగ్గా కలిసిన మాస్ సినిమా రాలేదు. ఆ లోటును తీర్చేది ఈ మాస్ జాతర అని విశ్వాసంగా తెలిపారు. అంతేకాకుండా, ప్రేక్షకులు థియేటర్‌లో ఈ సినిమాను చూస్తే ఖచ్చితంగా ఆనందంతో తేలిపోతారని అన్నారు. తన మాటలతో అందరినీ ఆశ్చర్యపరుస్తూ, ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోకపోతే నేను సినిమాల నుంచి తప్పుకుంటాను అని రాజేంద్ర ప్రసాద్ ఘాటుగా వ్యాఖ్యానించారు. తన కెరీర్‌లో ఎందరో తారలతో కలిసి పనిచేసినప్పటికీ, రవితేజతో ఇదే తన మొదటి కాంబినేషన్ అని చెప్పారు. రవితేజతో కలిసి పనిచేయడం ప్రత్యేక అనుభూతిగా ఉంది. మాస్ జాతర అనే అద్భుతమైన సినిమాను చేయడానికి ఇంత సమయం పట్టింది. దర్శకుడు భాను అద్భుతంగా తెరకెక్కించారు. నా పాత్ర గురించి ఇప్పుడే చెబితే థ్రిల్ పోతుంది, థియేటర్‌లో చూసి ఆనందించండని అన్నారు.



# మాస్ జాతరకు తిరుగులేదు

# మెగా 158లో నేను భాగం కావడం లేదు

### నటి మాళవికా మోహన్ ప్రకటన విడుదల

మెగాస్టార్ చిరంజీవి బాబీ కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. వాల్తేర్ వీరయ్య లాంటి సూపర్ హిట్ తర్వాత ఈ జోడి మళ్లీ కలిసి పనిచేయబోతుంది. మెగా 158 అంటూ రాబోతున్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే సెట్స్ మీదకి వెళ్లనుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా మాళవిక మోహనన్ నటించబోతున్నట్లు వార్తలు వచ్చాయి. తాజాగా ఈ వార్తలపై నటి స్పందిస్తూ.. అవన్నీ రూమర్స్ అంటూ తెలిపింది. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. నేను 'మెగా 158' చిత్రంలో నటిస్తున్నానని ఆన్‌లైన్‌లో అనేక వార్తలు వస్తున్నాయి. అయితే నా కెరీర్‌లో ఏదో ఒక రోజు ఐకానిక్ చిరంజీవి సార్‌తో స్క్రీన్ పంచుకోవాలని నేను ఎంతగానో కోరుకుంటున్నాను. కానీ ప్రస్తుతం నేను ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదు. ఆ



వార్తలు అవాస్తవం అంటూ మళావిక రాసుకోచ్చింది. దీంతో చిరంజీవి సరసన మాళవిక నటించబోతున్నారనే ఊహాగానాలకు తెరపడింది. త్వరలోనే ఈ చిత్రంలో నటించబోయే కథానాయిక గురించి చిత్ర బృందం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. ప్రస్తుతం చిరంజీవి నాలుగు సినిమాలతో బిజీగా ఉన్నారు. అనిల్‌రావిపూడి దర్శకత్వంలో 'మన శంకరవరప్రసాద్ గారు' రూపొందుతోంది. వచ్చే ఏడాది సంక్రాంతికి ఇది విడుదల కానుంది. అలాగే వశిష్ఠ దర్శకత్వంలో సోషియో ఫాంటసీ ఫిల్మ్ 'విశ్వంభర' రానుంది. వీటితో పాటు శ్రీకాంత్ ఓదెల, బాబీ దర్శకత్వంలో రెండు ప్రాజెక్ట్‌లు లైనప్‌లో ఉన్నాయి. ఇక మాళవిక 'ది రాజాసాబ్'తో పలకరిం చేందుకు సిద్ధంగా ఉన్నారు. ప్రభాస్ హీరోగా రూపొందుతోన్న ఈ చిత్రం జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది.



# ఆంధ్రా కింగ్ తాలూకా.. అనుకున్న సమయానికి విడుదల

ప్రస్తుతం ఏ సినిమా కూడా ముందు అనుకున్న విధంగా విడుదలకు నోచుకోవడం లేదు. డిసెంబర్ లో రావాల్సిన అడివి శేష్ 'డెకాయిట్'మూవీ ఏకంగా మూడు నెలలకు వాయిదా పడింది. అయితే చిత్రంగా కొన్ని సినిమాలు ఒకటి రెండు రోజుల ముందో, వారం ముందో వచ్చేస్తున్నాయి కూడా. అలా ఆ మధ్య 'లిటిల్ హార్ట్స్' మూవీ ఓ వారం ముందే వచ్చేసింది. మంచి విజయాన్ని అందుకుంది. అలానే ఇప్పుడు రామ్ పోతినేని నటిస్తున్న 'ఆంధ్ర కింగ్ తాలూకా' కూడా కాస్తంత ముందుగానే వస్తుందని తెలుస్తోంది. ఈ సినిమా మామూలుగా అయితే నవంబర్ 28న విడుదల కావాల్సి ఉంది. సహజంగా విడుదల తేదీకి ఒక రోజు ముందు యు.ఎస్.ఎ.లో ప్రీమియర్స్ వేస్తుంటారు. కానీ 'ఆంధ్రా కింగ్ తాలూకా' మూవీకి అమెరికాలో ప్రీమియర్స్ నవంబర్ 26నే వేసేస్తున్నారు. సో... ఈ సినిమా నవంబర్ 27నే జనం ముందుకు వస్తోందని టాలీవుడ్ ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ విషయాన్ని నిర్మాతలు ఇంతవరకూ అధికారికంగా మాత్రం ప్రకటించలేదు. 'ఆంధ్ర కింగ్ తాలూకా' చిత్రాన్ని మహేశ్ బాబు దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. భాగ్యశ్రీ బోర్సే ఇందులో హీరోయిన్ గా నటించింది. ఆంధ్ర కింగ్ గా ఉపేంద్ర నటించారు. ఈ సినిమా నుండి ఇప్పటికే రెండు సింగిల్స్ రాగా మూడోది అక్టోబర్ 31న రిలీజ్ కాబోతోంది. ఇదిలా ఉంటే... రవితేజ తాజా చిత్రం 'మాస్ జాతర' అక్టోబర్ 31న విడుదల కావాల్సింది. కానీ 'బాహుబలి – ది ఎపిక్' కోసం ఈ సినిమాను ఒక రోజు వెనక్కి తీసుకెళ్ళారు. నవంబర్ 1 నుండి అన్ని థియేటర్లలో నాలుగు ఆటల చొప్పున ప్రదర్శించబోతున్నారు. అక్టోబర్ 31న మాత్రం సాయంత్రం ప్రీమియర్ షోస్ వేస్తారని చెబుతున్నారు.

# పరేష్ రావెల్ ది తాజ్ స్టోరీపై కేసు దాఖలు

బాలీవుడ్ నటుడు పరేష్ రావల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న వివాదాస్పద చిత్రం 'ది తాజ్ స్టోరీ'. ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా విడుదలని అడ్డుకోవాలంటూ ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ చిత్రం చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమే కాకుండా, మత సామరస్యాన్ని దెబ్బతీస్తుందని పిటిషనర్ ఆరోపించారు. అడ్వకేట్ షకీల్ అబ్బాస్ ఈ పిటిషన్‌ను దాఖలు చేయగా.. ఇందులో ఆయన సెన్సార్ బోర్డు , కేంద్ర ప్రభుత్వం, చిత్ర నిర్మాత, దర్శకుడు, నటుడు పరేష్ రావల్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఈ చిత్రం తాజ్ మహల్ చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమే కాకుండా, మత సామరస్యాన్ని దెబ్బతీస్తుందని తెలిపాడు. అలాగే ఒక ప్రత్యేక రాజకీయ సిద్ధాంతాన్ని ఈ చిత్రం ప్రోత్సహిస్తోందని పిటిషనర్ ఆరోపించారు. ఈ సినిమా విడుదలైతే మత విద్వేషాలకు దారితీసే




అవకాశం ఉందని ఇది దేశ లౌకిక స్ఫూర్తిని దెబ్బతీస్తుందని అబ్బాస్ ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు స్పందిస్తూ.. ఈ పిటిషన్‌ను తక్షణమే విచారించడానికి నిరాకరించింది. ఈ అంశాన్ని సాధారణ విచారణలో భాగంగా పరిశీలిస్తామని కోర్టు స్పష్టం చేసింది.





# జాన్వీ, రామ్‌చరణ్‌పై శ్రీలంకలో పాట చిత్రీకరణ

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్యాన్ ఇండియా ప్రాజెక్ట్ 'పెద్ది'పై ప్రేక్షకుల్లో అంచనాలు పెంచుతున్నాయి. 'ఉప్పెన'తో సెన్సేషన్ సృష్టించిన బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే భారీ క్రేజ్ సంపాదించుకుంది. తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది' టీమ్ ప్రస్తుతం శ్రీలంకలో కీలకమైన షెడ్యూల్‌లో బిజీగా ఉంది. అక్కడ రామ్ చరణ్, జాన్వీ కపూర్ జంటపై ఓ అందమైన పాటను చిత్రీకరిస్తున్నారు. ఈ పాటకు ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండటంతో, ఇది విజువల్‌గా, మ్యూజికల్‌గా గ్రాండ్ ట్రీట్‌గా మారబోతోందని ఫిల్మ్‌నగర్ టాక్. రామ్ చరణ్ కూడా ఇటీవల శ్రీలంక బయలు దేరినట్లు సమచారం. ఇంతలో, శ్రీలంక లొకేషన్స్ నుంచి కొన్ని ఆసక్తికరమైన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. డైరెక్టర్ బుచ్చిబాబు సానా, సినిమాటోగ్రాఫర్ రత్నవేలు కలిసి దిగిన ఫోటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ఆ ఫోటోల్లో ఇద్దరూ ఒక పాత రైల్వే ట్రాక్ టన్నెల్ ముందు నిలబడి ఉన్నారు. ఈ లొకేషన్ చూసి ఫ్యాన్స్‌లో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. ఇది కేవలం సాంగ్ కోసం మాత్రమేనా? లేక సినిమాలో కీలకమైన యాక్షన్ లేదా ఎమోషనల్ సీక్వెన్స్‌కు సంబంధించిందా? అని ముచ్చ టించుకుంటున్నారు. ఆ టన్నెల్ బ్యాక్‌డ్రాప్ సినిమాకు ప్రత్యేకమైన భావోద్వేగ టచ్ ఇస్తుందని అంచనా. రత్నవేలు వంటి టాప్ సినిమాటోగ్రాఫర్ ఈ ప్రాజెక్ట్‌లో ఉండటంతో, విజువల్స్ నెక్స్ట్ లెవల్‌లో ఉంటాయని ఫ్యాన్స్ నమ్మకం. బుచ్చిబాబు, రత్నవేలు ఇద్దరి కాంబినేషన్ పిక్స్ ఆ అంచనాలను మరింత పెంచాయి. మొత్తానికి, 'పెద్ది' టీమ్ శ్రీలంకలో ఫుల్ స్వింగ్‌లో షూటింగ్ జరుపుకుంటోంది. విలేజ్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో చరణ్‌ను మల్టిపుల్ లుక్స్‌లో చూడబోతున్నారని టాక్. 2026 మార్చి విడుదల లక్ష్యంగా సినిమా శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకుంటోంది.



# సినిమాల్లోకి స్టార్ వారసురాలు

### ఎంట్రీ ఇస్తున్న మహేశ్ బాబు మేనకోడలు జాన్వీ

సినిమాల్లోకి మరో స్టార్ వారసురాలు ఎంట్రీకి రంగం సిద్దమైంది. సూపర్ స్టార్ కృష్ణ కుటుంబం నుంచి తొలిసారి హీరోయిన్ రంగ ప్రవేశం చేస్తుంది. సూపర్ స్టార్ మహేశ్ బాబు సోదరి , నిర్మాత మంజుల కూతురు జాన్వీ స్వరూప్ కథానాయికగా తెరపైకి రానున్నట్లు వార్తలు వైరల్ అవుతూ సినీ వర్గాల్లో పెద్ద చర్చగా మారింది. 2010లో సందీప్ కిషన్ హీరోగా మంజుల దర్వకత్వంలో వచ్చిన మనసుకు నచ్చింది సినిమాతో 10 ఏండ్ల వయసులోనే బాలనటిగా మంచి గుర్తింపు సంపాదించుకున్న జాన్వీ ఆపై తన కెరీర్‌పై దృష్టి పెట్టి ఉన్నత చదువులు పూర్తి చేసి డ్యాన్స్ ఇత్యాది అన్ని రంగాల్లో తర్ఫీదు తీసుకుని మల్టీ టాలెంటెడ్ అని అనిపించుకుంది. అయితే.. సినిమాలలో నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లుగా తాజాగా చేసిన గ్లామర్ ఫోటో షూట్ సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతోంది. జాన్వీ గతంలో మనకు కనిపించిన దానికి విరుద్ధంగా పూర్తిగా ఔట్ అండ్ ఔట్ స్టైల్, లుక్ మార్చి సరికొత్తగా ట్రెండింగ్ వేర్‌లో వివిధ డ్రెస్సింగ్లతో దర్శణమిచ్చి కృష్ణ, మహేశ్ బాబు అభిమానులను, నెటిజన్లను ఒకింత ఆశ్చర్యానికి గురి చేసింది. మరోవైపు కృష్ణ కుమారుడు దివంగత రమేశ్ బాబు వారసులు జమకృష్ణ, సైతం హీరో హీరోయున్లుగా వేర్వేరు చిత్రాలతో ఎంట్రీ ఇస్తున్న సమాచారం తెలిసిందే. ఇది ఇలా ఉండగానే ఇప్పుడు జాన్వీ కూడా సిద్ధమవుతుండడంతో కృష్ణ, మహేశ్ అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**,and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No.132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252., and Published at H.No. 132, Markondeya Nagar, Choutuppal Municipality, YadadriBhuvanagiri District, Telangana State508252. **Editor: POLOJU SRINIVASA CHARY. RNI No: TGTEL/25/A0305**, Cell:9985389183. **Email Id:vaarthavedhikasurya2025@gmail.com**